

విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

కంటి పాపలకు.. కష్టమొచ్చింది

- ప్రభుత్వ పాఠశాలల్లో 38,008మంది విద్యార్థులకు కంటి సమస్యలు
- ఈ విద్యా సంవత్సరంలో 3.05 లక్షల మందికి కంటి పరీక్షలు
- 5,180 మందికి ఉచిత కళ్ళజోళ్ళు పంపిణీకి ప్రణాళిక

గుంటూరు(విద్య), సెప్టెంబరు 25: పేదరికం.. పౌష్టికాహార లోపం.. అవగాహన రాహిత్యం వెరసి పేదకుటుంబాల్లో విద్యార్థులకు కంటి సమస్యలు శాపాలుగా మారుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు కంటి సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి దిగ్భ్రాంతికర పరిస్థితులు భావిపౌరుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని వైద్యులు చెబుతున్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో అంధత్వనివారణ సంస్థ నిర్వహించిన కంటిపరీక్షల్లో 38వేల మందికి పైగా విద్యార్థులు కంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నట్లు నిర్ధారించారంటే సమస్య ఎంత తీవ్రంగా ఉందో అవగతం చేసుకోవచ్చు.

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ జడ్పీ, ఎయిడెడ్, మండల పరిషత్ పాఠశాలల్లో దాదాపు 6.75లక్షల మంది విద్యార్థులు ఒకటి నుంచి 10వ తరగతి వరకు విద్యాభ్యాస్యం చేస్తున్నారు. ఇందులో అనేకమంది పౌష్టికాహారం లోపంవల్ల కంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు ప్రభుత్వ గుర్తించింది. ఈ నేపథ్యంలో అన్ని ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో స్కూల్‌హెల్త్ కార్యక్రమంలో భాగంగా కంటిపరీక్షలు నిర్వహించాలని జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారులకు ఆదేశాలు జారీచేసింది. తొలి విడత ఈ ఏడాది సెప్టెంబరు నెలాఖరువరకు ఉమ్మడి జిల్లాలోని 1188 పాఠశాలల్లో 3.08లక్షల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో దాదాపు 38,008 మంది విద్యార్థిని విద్యార్థులు ఎదో ఒక కంటి సమస్యతో ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించారు. వీరిలో తప్పని సరిగా కళ్ళజోళ్ళు అవసరమైన విద్యార్థులు 5,186 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరికి త్వరలో కళ్ళజోళ్ళు పంపిణీ చేయడానికి జిల్లా అంధత్వనివారణ, సమగ్రశిక్ష అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

గుర్తింపు ఇలా....

పాఠశాలల్లో కంటి సమస్యలతో ఇబ్బందులు పడే విద్యార్థులను గుర్తించడానికి సైన్స్ ఉపాధ్యాయులు, ఏఎన్ఎం, ఇతర వైద్యసిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వారికి కొన్ని పరికరాలు అందజేశారు. సమస్యలు గుర్తించడానికి జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షించి చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా దాదాపు 600మందికిపైగా ఉపాధ్యాయులకు ప్రత్యేకశిక్షణ అందించారు.

కంటి సమస్యలకు ఇవీ ప్రధాన కారణాలు...

దృష్టిలోపానికి ప్రధానంగా ఆరు కారణాలను వైద్యులు చెబుతున్నారు. కంటికి దెబ్బ లేదా గాయం ఏర్పడడం, పోషకాహారలోపం, అంటువ్యాధులు, రసాయనిక చర్య అంటే కంట్లో హానికరమైన ద్రవాలు, రంగులు పడడం, వంశపారంపర్యం, ఆపరేషన్ తరువాత వచ్చే ఇన్‌ఫెక్షన్ సమస్యలు ప్రధాన కారణాలని కంటి వైద్యులు చెబుతున్నారు. పాఠశాల స్థాయి విద్యార్థుల్లో అత్యధిక మంది పౌష్టికాహారం లోపం, వంశపారంపర్య కారణాల వల్ల కంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు కంటి వైద్యులు చెబుతున్నారు.

ఉచితంగా కళ్ళజోళ్ళు పంపిణీ


- డాక్టర్ చుక్కారత్నమన్మోహన్



జిల్లాలో 2024-25 సంవత్సరానికి గాను ఆగస్టు నుంచి అక్టోబర్ నెలాఖరు వరకు పాఠశాలల్లో ఉచితంగా కంటి పరీక్ష లు నిర్వహిస్తున్నట్లు జిల్లా అంధత్వనివారణ సంస్థ అధికారి డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్ ఆంధ్రజ్యోతికి వివరించారు. ఇప్పటికే 2.80లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహించామని, ఇందులో 36,411 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తిం చినట్లు తెలిపారు. వీరిలో 3,798 మందికి ఉచితంగా ఈ ఏడాది కళ్ళజోళ్ళు ప్రభుత్వం పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్న ట్లు తెలిపారు. అక్టోబరు నెలాఖరు వరకు కంటి పరీక్షల స్క్రీనింగ్ పాఠశాలల్లో జరుగుతుందని పేర్కొన్నారు.

సిద్ధమవుతోన్న.. రైతుల ప్లాట్లు

- నాటి వైసీపీ పాలనలో చిట్టడవిలా రైతుల ప్లాట్లు
- నేడు అద్దాల్లా చదునుగా దర్శనమిస్తున్న వైనం
- నాడు ఒక వెలుగు వెలిగిన ఆర్- 5 జోన్ ప్లాట్లు
- నేడు కంప చెట్లుతో నిండిపోయిన ఆర్- 5 జోన్
- కోర్టు కేసు నడుస్తుండడంతో ఆ వైపు చూడని సీఆర్డీఏ



నాడు కంపచెట్లతో వున్న రైతుల ప్లాట్లు, పొలాలు



కంపచెట్లు తొలగడంతో కనువిందుగా రైతుల ప్లాట్లు, పొలాలు



కంపచెట్లతో నిండిపోయిన అంతర్గత రహదారి నాడు..



కంపచెట్లు తొలగించిన తరువాత రోడ్డు

గుంటూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఓడలు బళ్ల.. బళ్ల ఓడలు కావడం అంటే ఇదేనేమో.. గత వైసీపీ పాలనలో చిట్టడవిలా మారి, చీకటితో నిండిపోయిన నవ్యాంధ్ర రాజధాని నేడు వెలుగులు చిమ్ముతోంది. నాడు రైతుల గుండెల్లో కుంపట్లు రాజేసిన ఆర్- 5 జోన్ నేడు కంప చెట్లతో అడవిలా మారిపోయింది. సరిగ్గా 15 నెలల్లో ఎంత మార్పు! 'ఇదే నా మాట.. నా మాటే శాసనం అన్నట్లుగా' సాగిన గత ఐదేళ్ల జగన్మోహనరెడ్డి పాలనలో 'తామే శాశ్వతం.. తామన్నదే వేదం.. తాము చెప్పిందే చట్టం' అన్నట్లుగా అమరావతిపై ఇష్టారీతిగా విరుచుకుపడ్డారు. సీఆర్డీఏ మాస్టర్ ప్లాన్‌ను ఉల్లంఘించి ఆర్- 5 జోన్ పేరుతో రాజధాని రైతుల గుండెలపై చిచ్చు రాజేశారు. సరిగ్గా ఏడాదిలోపే నియంతృత్వ పోకడలతో అమరావతి ధ్వంస రచన చేసిన వైసీపీ సర్కారు కుప్పకూలిపోయింది. టీడీపీ- జనసేన- బీజేపీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం తెరపైకి వచ్చింది. అంతే పరిస్థితి మొత్తం తలకిందులైపోయింది.

కళకళలాడుతున్న ప్లాట్లు

రాజధాని కోసం భూములిచ్చిన 28,500 మంది రైతులకు ఇవ్వాల్సిన రిటర్నబుల్ ప్లాట్లను వైసీపీ ప్రభుత్వం తీవ్రనిర్లక్ష్యం చేసింది. ఐదేళ్లపాటు వాటిని పట్టించుకోకుండా వదిలేసింది. దీంతో కంపచెట్లతో రైతుల ప్లాట్లు అడవిలా మారిపోయాయి. పరిపాలనా వికేంద్రీకరణ పేరుతో జగన్ సర్కార్ ప్రవేశపెట్టిన మూడు రాజధానుల చట్టాన్ని కొట్టివేస్తూ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం 2022 మార్చి 30న చరిత్రాత్మకమైన తీర్పు ఇచ్చింది. ఆ తీర్పులో రైతుల ప్లాట్లలో వున్న చెట్లను తొలగించి వారికి ఆరు నెలల్లో స్థలాలు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. అయినప్పటికీ గత ప్రభుత్వం కోర్టు ధిక్కరణకు పాల్పడిందే తప్ప ఒక్క చెట్టు కూడా తొలగించలేదు. అలాంటి రైతుల ప్లాట్లు కూటమి ప్రభుత్వం రాకతో కళకళలాడుతున్నాయి. 36.5 కోట్ల రూపాయలతో కూటమి ప్రభుత్వం 24వేల ఎకరాల్లో కంపచెట్లను తొలగించింది. కిందటి నెల 7న కంప చెట్ల తొలగింపుకు మంత్రి నారాయణ శ్రీకారం చుట్టగా నెల రోజుల్లో రాజధాని స్వరూపం మారిపోయింది. కాంట్రాక్టు దక్కించుకున్న ఎన్‌సీసీ సంస్థ పనులను శరవేగంగా సాగించింది. వర్షాలు పడినప్పటికీ పనులు వేగంగా సాగేలా చూసింది. దీంతో రైతుల ప్లాట్లు అందంగా కళకళలాడుతున్నాయి.



నాడు ఆర్- 5 జోన్ ప్లాట్లు

నేడు కంపచెట్లతో అడవిలా ఆర్- 5 జోన్

అడవిలా మారిన ఆర్- 5 జోన్

రాజధాని మాస్టర్ ప్లాన్‌ను విచ్ఛిన్నం చేసి, రాజధాని నిర్మాణాన్ని శాశ్వతంగా సమాధి చేయాలని భావిస్తూ జగన్ సర్కార్ 2023లో 'రాజధానిలో పేదలకు ఇళ్లు' అంటూ ఆర్- 5 జోన్ చిచ్చు రాజేసింది. రాజధానికి అత్యంత కీలకమైన ఎలక్ట్రానిక్ సిటీ, ఫైనాన్షియల్ సిటీలను, పరిశ్రమలకు కేటాయించిన భూములను టార్గెట్ చేస్తూ ఆ భూముల్లో 53వేల మందికి సెంటు స్థలాలు ఇచ్చేందుకు ప్లాట్లు వేశారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతుల స్థలాల్లో చెట్ల తొలగింపుకు రూపాయి కూడా ఖర్చు చేయని వైసీపీ ప్రభుత్వం ఆర్- 5 జోన్లో ప్లాట్ల పేరుతో అక్షరాలా రూ. 130 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. కేవలం నెల రోజుల వ్యవధిలోనే కంప చెట్లు తొలగించి, ప్లాట్లలో మెరక తోలించి, విద్యుత్ స్తంబాలు ఏర్పాటు చేయించి, ట్రాన్స్‌ఫార్మర్లు బిగించి, రోడ్లు వేయించి ఆర్- 5 జోన్‌ను సర్వాంగ సుందరంగా సిద్ధం చేసింది. రైతుల పోరాటం కారణంగా సుప్రీంకోర్టు ఆ వ్యవహారాన్ని అడ్డుకొంది. అంతే ఆర్- 5 జోన్‌కు కుట్ర ఆగిపోయింది. రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం ఆర్- 5 జోన్ అడవిలా మారిపోయింది. ఆర్- 5 జోన్ వ్యవహారం న్యాయస్థానాల పరిధిలో వుండడంతో కూటమి ప్రభుత్వం దాని జోలికి పోలేదు. దీంతో విద్యుత్ స్తంబాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ప్లాట్లు మొత్తం చిల్ల కంప అల్లుకుపోయింది.

రోడ్లకు మహర్దశ

కూటమి ప్రభుత్వం వచ్చినవెంటనే రాజధానిలో మౌలిక సదుపాయాలపై దృష్టి సారించింది. వైసీపీ పాలనలో మట్టిదిబ్బలతో, కంపచెట్లతో నిండిపోయిన సీడ్ యాక్సిస్ రోడ్డుకు మహర్దశ పట్టింది. అది తాజాగా ఎన్‌హెచ్-16తో అనుసంధానం కాబోతోంది. కంపచెట్ల తో నిండిపోయిన అంతర్గత రోడ్లు అం దంగా తయారై, వినియోగా నికి పూర్తిగా సిద్ధమయ్యాయి.

167ఏ.. భూసేకరణ వేగవంతం

- నిధులు సిద్ధం.. భూముల సర్వే పూర్తి
- వైసీపీ విఫలం.. కూటమి ప్రభుత్వంలో కదలిక
- భూములు ఇచ్చేందుకు ఐదు గ్రామాల్లో వ్యతిరేకత
- మిగిలిన గ్రామాల రైతుల నుంచి ఒప్పంద పత్రాల స్వీకరణ
- గ్రామాల వారీగా రైతులతో సమావేశాలు నిర్వహిస్తున్న జేసీ సూరజ్



నాదెండ్లలో రైతుల అభిప్రాయాలు స్వీకరిస్తున్న జేసీ సూరజ్

(నాదెండ్ల/నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసిన పొందుగల.. ఓడరేవు 167 ఏ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో కదలిక వచ్చింది. నాలుగు వరసలుగా రోడ్డు విస్తరణ, చిలకలూరిపేట, నరసరావుపేట పట్టణాలకు బైపాస్ నిర్మాణానికి 739.31 ఎకరాల భూమి సేకరించాలని జాతీయ రహదారి శాఖ గుర్తించింది. రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.825.76 కోట్లు మంజూరు చేసింది. రహదారికి 706.80 ఎకరాలు ప్రైవేట్ భూమి, 32.51 ఎకరాలు ప్రభుత్వ భూమి అవసరమని నిర్ధారించారు. ప్రైవేట్ భూమి సేకరణకు సర్వే నెంబర్లు వారీగా గుర్తించి రైతుల పేర్లను కూడా నమోదు చేశారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయడంలో విఫలమైంది. కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో రహదారికి సంబంధించిన భూసేకరణ ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. పల్నాడు జిల్లాలో చిలకలూరిపేట, నరసరావుపేట, రొంపిచర్ల, నకరికల్లు మండలాలో పరిధిలో భూసేకరణ చేయాల్సి ఉంది. బాపట్ల జిల్లా పరిధిలో రహదారి పనులు చురుగ్గా సాగుతున్నాయి. చిలకలూరిపేట మండలం కంతేటివారికండ్రిక నుంచి నకరికల్లు అడ్డరోడ్డు వరకు భూసేకరణ జరగనున్నది. అయితే నరసరావుపేట మండలంలోని ఐదు గ్రామాల రైతులు భూసేకరణను వ్యతిరేకిస్తూ ఉద్యమబాట పట్టారు. ఈ నేపథ్యంలో ఈ గ్రామాలు మినహా మిగిలిన ప్రాంతంలో భూసేకరణ చేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. మండలాల వారీగా రైతులతో అధికారులు ముఖాముఖి నిర్వహిస్తున్నారు. నాదెండ్లలో బుధవారం జేసీ సూరజ్, ఆర్డీవో సరోజిని, తహసీల్దారు ఏవీ రమణలతో కలిసి భూసేకరణకు సంబంధించి తహసీల్దారు కార్యాలయంలో రైతులతో సమావేశమయ్యారు. ఇర్లపాడు, కనపర్రు, గణపవరం గ్రామాలకు చెందిన 4.38 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉండగా రైతుల అభిప్రాయాలు తీసుకుని, వారినుంచి భూముల దస్త్రాలను పరిశీలించారు. సంబంధిత పత్రాలతో పాటు రైతుల నుంచి ఒప్పంద పత్రాలను స్వీకరించారు. నకరికల్లు, రొంపిచర్ల మండలాల్లో రైతులతో ముఖాముఖి గురు, శుక్రవారాల్లో పూర్తి చేయనున్నారు.

ఆ ఐదు గ్రామాల్లో వ్యతిరేకత..

నరసరావుపేట మండలంలోని రావిపాడు, కేసానుపల్లి, గుంటగార్లపాడు, జొన్నలగడ్డ గ్రామాల రైతులు భూసేకరణను వ్యతిరేకిస్తున్నారు. వీరు సర్వేను కూడా అడ్డుకున్నారు. ప్రైవేట్ మార్కెట్‌లో భూమి విలువ కోట్లల్లో ఉందని, ప్రభుత్వం చెల్లించే పరిహారం రూ.లక్షల్లో ఉందని బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు, చిలకలూరిపేట, సత్తెనపల్లి, రావిపాడు, గుంటగార్లపాడు, ప్రధాన రహదారికి ఇరువైపులా ఎకరం రెండు నుంచి మూడు కోట్లకు పైగా ధర పలుకుతున్నదు. ఈ స్థాయిలో ప్రభుత్వం పరిహారం చెల్లించే పరిస్థితి లేదు. ఈ పరిస్థితుల్లో భూములను చౌకగా రోడ్డుకు ఇవ్వలేమని, తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని ఆ ఐదు గ్రామాల రైతులు కోరుతున్నారు.




రహదారి విస్తరణ మ్యాప్

సాగు నీటి కోసం ఇక్కట్లు

- కాల్వలో కంప తొలగింపునకు రైతుల యత్నం
- ఎన్నెస్పీ అధికారులు అడ్డుకోవడంపై ఆగ్రహం

ఈపూరు, సెప్టెంబరు 25: పెరుమాళ్లపల్లి మేజరు కాల్వలో కంపచెట్లు అల్లుకు పోయి, నాచు అడ్డుకోవడంతో దిగువ భూములకు సాగునీటి పారుదల జరగడంలేదు. కళ్ల ముందు పంటలు ఎండిపోతుండటంతో కాల్వలో నాచు, కంపచెట్లను తొలగించేందుకు ఎక్స్‌కవేటర్ సాయంతో బుధవారం రైతులు పనులకు సిద్ధమయ్యారు. వీరిని ఎన్నెస్పీ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మెయిన్ కెనాల్ నుంచి మేజర్‌కు నీటిని వదిలే దగ్గర ఏర్పాటు చేసిన షట్టర్ దించితే కాల్వలో నీటి ప్రవాహం తగ్గి నాచు తొలగించడం సులభమవుతుందని రైతులు చెబుతున్నారు. ఎన్నెస్పీ సిబ్బంది మాత్రం షట్టర్ దించితే మళ్లీ పైకి తీయడం కుదరదన్నారు. దీంతో రైతులు కాల్వపై ఆందోళనకు దిగారు. కట్టలపై అడ్డంగా పెరిగిన కంపచెట్లను కూడా తొలగించకపోవడంతో కాల్వలు చిట్టడవిని తలపిస్తున్నాయి.



పెరుమాళ్ళపల్లి మేజర్ కాలువ నీటి కోసం ఆందోళన చేస్తున్న దిగువ భూముల రైతులు



కాలువలో అల్లుకు పోయిన కంపచెట్లు

కాల్వ కాదు.. హైవే

- చిలకలూరిపేటలో భారీ వర్షం
- జాతీయ రహదారిపైకి చేరిన నీరు



చిలకలూరిపేటలో జాతీయ రహదారిపై నిలిచిన నీరు

చిలకలూరిపేట సెప్టెంబరు 25: పట్టణంలో బుధవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. దీంతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. చిలకలూరిపేట - గుంటూరు మార్గంలో స్థానిక ఏఎంజీ సంస్థకు సమీపంలో జాతీయ రహదారి పైకి వర్షపు నీరు భారీగా చేరింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అసౌకర్యం ఏర్పడింది. ఆక్రమణలు, కాల్వలు పూడికతో నిండిపోవడంతో జాతీయ రహదారిపైకి చేరిన వర్షపు నీరు పోయే మార్గంలేక నిలిచిపోయింది. వర్షానికి తండ్రి సన్నిధి వెనుక వైపు ఉన్న భావనారుషినగర్ ప్రాంతమంతా నీటితో నిండిపోయింది.



చిలకలూరిపేట భావనా రుషి నగర్‌లో నిలిచిన వర్షపు నీరు

ప్రజా పంపిణీ ప్రక్షాళన

- కొత్తగా రానున్న రేషన్ దుకాణాలు
- రేషనలైజేషన్‌తో మరికొన్ని వచ్చే అవకాశం
- ఖాళీల భర్తీకి సంయుక్త కలెక్టర్ షెడ్యూల్ ఖరారు



నరసరావుపేట, సప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీ వ్యవస్థ ప్రక్షాళనకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో జిల్లాలో రేషన్ దుకాణాల పునర్విభజన జరగనున్నది. అవసరం ఉన్న చోట చౌక దుకాణాల సంఖ్య పెంచేందుకు మార్గదర్శకాలు జారీ అయ్యాయి. దుకాణాలు పెరగనుండగా వాటిపై పౌరసరఫరాలశాఖ దృష్టి సారించింది. ఈ క్రమంలో జిల్లాలో కొత్తగా మరికొన్ని రేషన్ దుకాణాలు రానున్నాయి. జిల్లాలోని 28 మండలాల్లో 6,45,110 కార్డులు ఉండగా 1,289 చౌక దుకాణాల ద్వారా నిత్యావసరాలు అందచేస్తున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రేషన్ షాపుల క్రమబద్ధీకరణ చేపట్టనున్నారు. వైసీపీ ప్రభుత్వం ఎండీయూ వ్యవస్థని తీసుకొచ్చి ప్రజా పంపిణీపై ఆర్థికభారాన్ని మోపింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొంతమంది ఎండీయూలు వెళ్లిపోయారు. కొందరు కొనసాగుతున్నారు. వైసీపీ హయాంలో కొంతమంది పలుకుబడి కలిగిన డీలర్లు ఎక్కువ కార్డులు వారి షాపు పరిధిలోకి బదిలీ చేయించుకున్నారు. దీని వల్ల కొన్ని దుకాణాల్లో వెయ్యి కార్డులు పైగా ఉంటే కొన్నింటిలో 500 లోపే ఉన్నాయి. ప్రభుత్వం డీలర్ల వ్యవస్థను బలోపేతం చేయాలని భావించి పునర్విభజన ద్వారా ఒక్కో చౌక దుకాణం పరిధిలో గ్రామీణ ప్రాంతాల్లో 400-450, పట్టణ ప్రాంతాల్లో 500-550 కార్డులు ఉండేలా చర్యలకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. జిల్లాలో 800 కంటే ఎక్కువ కార్డులు ఉన్న దుకాణాలను తహసీల్దార్లు గుర్తిస్తున్నారు. 30 తేదీ కల్లా సమాచారం పంపాలని జిల్లా సంయుక్త కలెక్టర్ సూరజ్ అధికారులను ఆదేశించారు. పునర్విభజనకు క్షేత్రస్థాయిలో మండలాల వారీగా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. జేసీ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం తహసీల్దార్లు చర్యలు చేపట్టారు. అక్టోబరు 7 కల్లా పునర్విభజన పూర్తి చేసి ఖాళీగా ఉన్న షాపులను భర్తీ చేయనున్నారు. పునర్విభజనతో పెరిగిన, ఖాళీగా ఉన్న రేషన్ షాపుల భర్తీకి ఆర్డీవోలు 24న నోటిఫికేషన్ జారీ చేస్తారు. నవంబరు 7న దరఖాస్తుదారులకు రాత పరీక్ష నిర్వహిస్తారు. దీనిలో ఉత్తీర్ణులైన వారికి 12న ఇంటర్వ్యూ నిర్వహించి 15న ఎంపిక చేసి 16న వారికి నియామక పత్రాలను అందజేయనున్నారు.

ఆంధ్రజ్యోతి
6
నవ్య చిత్రజ్యోతి
గుంటూరు • గురువారం 26 సెప్టెంబరు 2024
cinema@andhrajyothy.com



నా దృష్టిలో... వేడుక అంటే ఇదే

నటి శోభితా ధూళిపాళ, నాగచైతన్య ఇటీవలే నిశ్చితార్థం చేసుకున్న సంగతి విదితమే. ఎంతో సింపుల్‌గా జరిగిన ఈ ఎంగేజ్‌మెంట్ గురించి ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఈ వేడుకను గ్రాండ్‌గా చేసుకోవాలని ముందుగా ప్లాన్ చేయలేదు. ఇలా ఉండాలి.. అలా ఉండాలి అని కలలు కనలేదు. జస్ట్.. జీవితంలో అతి ముఖ్యమైన ఆ మధుర క్షణాలని ఆస్వాదించాలని అనుకున్నాను. తెలుగు సంప్రదాయాలకు అనుగుణంగా ఇలాంటి వేడుకలు జరగాలని కోరుకునేదాన్ని. ఇది ఇలాగే జరిగింది. కాబట్టి ఈ వేడుక నిరాడంబరంగా జరిగిందని అనుకోవట్లేదు. నా వరకూ ఇదో పర్ఫెక్ట్ పద్ధతిలో సాగిన వేడుక" అని చెప్పారు.



నేరస్థుల పాలిట యముడు

'జై భీమ్' ఫేమ్ టీ.జే. జ్ఞానవేల్ దర్శకత్వంలో రజనీకాంత్ నటిస్తున్న చిత్రం 'వేట్టయాన్' (ద హంటర్). ఇందులో అమితాబ్ బచ్చన్, రానా దగ్గుబాటి, ఫహాద్ ఫాజిల్, మంజు వారియర్, రితికా సింగ్ కీలక పాత్రలు పోషించారు. 33 ఏళ్ల తర్వాత రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ కలసి నటించిన చిత్రం ఇదే కావడంతో ఈ సినిమాపై అంచనాలు ఓ రేంజ్‌లో ఉన్నాయి. తాజాగా, రజనీ పాత్రను పరిచయం చేస్తూ మేకర్స్ ఓ ప్రివ్యూను విడుదల చేశారు. ఇందులో నేరస్థుల పాలిట యముడిగా.. ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా.. ఆయన పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉంటుందో హింటిచ్చారు. అలాగే, సినిమాలోని ముఖ్య పాత్రధారుల్ని ఈ వీడియోలో పరిచయం చేశారు. దసరా కానుకగా అక్టోబరు 10న ప్రేక్షకులను పలకరించనుంది.

ఆ వీధికి గాయకుడు బాలు పేరు



• సీఎం స్టాలిన్ ఉత్తర్వులు

గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం (ఎస్పీబీ) వర్ధంతి సందర్భంగా ఆయన అభిమానులకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్వాంతన చేకూర్చే కబురందించారు. బాలసుబ్రహ్మణ్యం తనయుడు ఎస్పీ చరణ్ కోరిక మేరకు స్థానిక నుంగంబాక్కంలోని కామ్‌దార్‌నగర్ మొదటివీధి పేరును మార్చేందుకు స్టాలిన్ అంగీకరించారు. ఆ మేరకు బుధవారం సాయంత్రం ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం యేళ్ల తరబడి నివసించిన కామదార్‌నగర్ ఫస్ట్‌స్ట్రీట్ పేరును 'ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం రోడ్డు'గా మార్చుతున్నట్లు ప్రకటించారు. ఎస్పీబీ భౌతికంగా లేకపోయినా వివిధ భాషల్లో ఆయన పాడిన పాటల ద్వారా అభిమానుల మనస్సుల్లో చిరంజీవిగా సుస్థిరంగా నిలిచి ఉంటారని స్టాలిన్ ఈ సందర్భంగా కొనియాడారు.

- చెన్నై (ఆంధ్రజ్యోతి)

కేరళలో ముగించారు



శర్వానంద్ కథానాయకుడిగా రామ్ అబ్బరాజు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం ('శర్వా 37'- వర్కింగ్ టైటిల్) కీలక షెడ్యూల్ పూర్తయింది. పది రోజుల పాటు కేరళలో జరిగిన షెడ్యూల్‌లో పాట, ఫైట్ సీక్వెన్స్‌తో పాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ చిత్రంలో శర్వానంద్‌కు జంటగా సాక్షి వైద్య, సంయుక్త నటిస్తున్నారు. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రానికి విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: జ్ఞానశేఖర్ వీఎస్

నటి ఊర్మిళ విడాకులు



'రంగీలా, భారతీయుడు' లాంటి హిట్ చిత్రాలతో ప్రేక్షక హృదయాలను కొల్లగొట్టారు నటి ఊర్మిళా మతోండ్కర్. కశ్మీర్‌కు చెందిన వ్యాపారవేత్త మోసిన్ అక్తర్ మీర్‌ను ఆమె 2016లో పెళ్లాడారు. అయితే ఇప్పుడు వీరి వైవాహిక జీవితం ఒడిదుడుకులు ఎదుర్కొంటోందనీ, త్వరలోనే ఇద్దరూ విడిపోబోతున్నారని బాలీవుడ్ వర్గాల సమాచారం. ఊర్మిళ నాలుగు నెలల క్రితమే విడాకుల కోసం ముంబై కోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు జాతీయ మీడియా పేర్కొంది.

దేవర టికెట్ ధరల పెంపు 10 రోజులే

జూనియర్ ఎన్టీఆర్ నటించిన 'దేవర' సినిమా టికెట్ల ధరల పెంపును 10రోజులకే పరిమితం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈమేరకు ఉత్తర్వులు ఇస్తున్నామని పేర్కొంది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ నెల్లూరుకు చెందిన పి. శివకుమార్ రెడ్డి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ నెల 27న విడుదల కానున్న దేవర సినిమా ప్రత్యేక ప్రదర్శనలతో పాటు టికెట్ ధరలను పెంపునకు అనుమతిస్తూ నిబంధనలకు లోబడి టికెట్ ధరలు నిర్ణయించేలా ఆదేశాలు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది శివప్రసాద్ రెడ్డి వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 13 ప్రకారం సినిమా విడుదలైన నాటి నుంచి పదిరోజుల పాటు మాత్రమే టికెట్ ధరల పెంపునకు వెసులుబాటు ఉందని న్యాయస్థానం గుర్తు చేసింది. ప్రభుత్వం జారీ చేసిన మెమోపై స్పష్టతనిస్తూ పూర్తి వివరాలతో కౌంటర్



దాఖలు చేయాలని ప్రభుత్వానికి, చిత్ర నిర్మాతకు నోటీసులు జారీ చేసింది. విచారణను వారంరోజులకు వాయిదా వేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్. ప్రణతి వాదనలు వినిపిస్తూ.. టికెట్ ధరల పెంపుపై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మెమోలో పెంపు ఎన్ని రోజులో ప్రస్తావించలేదన్నారు. వివరాలు సమర్పించేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు.

- అమరావతి (ఆంధ్రజ్యోతి)

ఒక్క రాత్రిలో జరిగే కథ



ఫీల్‌గుడ్ ప్రేమకథా చిత్రం '96'తో అందరినీ విశేషంగా ఆకట్టుకున్న దర్శకుడు సి. ప్రేమ్‌కుమార్. ఆయన తెరకెక్కించిన తాజా చిత్రం 'సత్యం సుందరం'. కార్తి, అరవింద స్వామి ప్రధాన పాత్రలు పోషించారు. సూర్య, జ్యోతిక నిర్మించారు. ఈ నెల 28న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా దర్శకుడు సి. ప్రేమ్‌కుమార్ మీడియాతో ముచ్చటించారు. "ఇదో బ్యూటిఫుల్ ఫ్యామిలీ డ్రామా. ఈ సినిమాకు కార్తి, అరవింద్ స్వామి బిగ్గెస్ట్ స్ట్రెంగ్త్. వారిద్దరూ అంగీకరించకుంటే.. ఈ ప్రాజెక్ట్‌ను మొదలెట్టేవాణ్నే కాదు. ఇది ఒక్క రాత్రిలో జరిగే కథ. సక్సెస్‌ను, ఫెయిల్యూర్‌ని నేను పట్టించుకోను. సినిమా చేసేటప్పుడు వచ్చే సంతృప్తి మాత్రమే ముఖ్యం. ఈ సినిమా విషయంలో చాలా సంతోషంగా ఉన్నాను. ప్రొడ్యూసర్స్ సూర్య, జ్యోతిక మేకింగ్ విషయంలో పూర్తి స్వేచ్ఛనిచ్చారు. టెక్నికల్‌గా సినిమా ఉన్నతంగా ఉంటుంది. గోవింద్ వసంత ఇచ్చిన సంగీతం అద్భుతంగా ఉంటుంది. తెలుగు ప్రేక్షకులను కచ్చితంగా అలరించే సినిమా ఇది" అని చెప్పారు.

ఇన్ ప్రోగ్రెస్



విభిన్నంగా 'క'

కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న భారీ పీరియాడికల్ థ్రిల్లర్ 'క'. నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటించారు. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో రూపుదిద్దుకున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌తో సుజిత్, సందీప్ దర్శకులుగా పరిచయమవుతున్నారు. షూటింగ్ పార్ట్ పూర్తయిందనీ, ఈ చిత్ర నిర్మాణం తమకు మధురమైన అనుభూతులు మిగిల్చిందనీ, జీవితాంతం గుర్తుండిపోయే అనుభవాలను ఇచ్చిందనీ వారు పేర్కొన్నారు. సినిమా సాధించే హిట్ కోసం ఎదురుచూస్తున్నామని సుజిత్, సందీప్ చెప్పారు. టైటిల్‌కు తగ్గట్లుగానే సినిమా కూడా విభిన్నంగా ఉంటుందని వారు తెలిపారు. ఈ సినిమాను తెలుగులో వంశీ నందిపాటి, మలయాళంలో హీరో దుల్కర్ సల్మాన్ విడుదల చేస్తున్నారు..

ఆ శత్రువుని వెంటేసుకుని పుడతాడు



'మనిషి పుట్టడంతోనే జీవితం అనే శత్రువుని వెంటేసుకుని మరీ పుడతాడు. దాని మీద గెలిచినోడే గొప్పవాడవుతాడు. ఓడినోడు మధ్యలోనే..' అనే డైలాగ్‌తో మొదలయ్యే 'కలి' చిత్రం థియేట్రికల్ ట్రైలర్‌ను దర్శకుడు ప్రశాంత్ వర్మ విడుదల చేశారు. ప్రిన్స్, నరేశ్ అగస్త్య ఇందులో హీరోలుగా నటించారు. శివశేషు దర్శకత్వంలో లీలా గౌతమ్ వర్మ నిర్మించారు. అక్టోబర్ నాలుగున సినిమాను విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇది సైకలాజికల్ థ్రిల్లర్ అనీ, ప్రేక్షకులను అలరిస్తుందని దర్శకుడు చెప్పారు. కష్టాలతో ఆత్మహత్య చేసుకోవాలనుకునే శివరామ్ (ప్రిన్స్) ఇంటికి అపరిచిత వ్యక్తి (నరేశ్ అగస్త్య) వస్తాడు. అతను వచ్చాక శివరామ్ జీవితంలో ఎదురైన అనూహ్య సంఘటనలు ఏమిటన్నవి ఆసక్తికరంగా ఉంటాయని దర్శకుడు శివశేషు చెప్పారు.

వారణాసి నేపథ్యంలో



శివ తత్వాన్ని వివరిస్తూ వారణాసి బ్యాక్‌డ్రాప్‌లో రూపుదిద్దుకుంటున్న 'లైఫ్' చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తయింది. శ్రీహర్ష, కషిక కపూర్ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి పవన్ కేతరాజు దర్శకుడు. కిశోర్ రాతి, మహేశ్ రాతీ, ఎ.రామస్వామి రెడ్డి నిర్మాతలు. 'ఒక మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. హీరో తండ్రి పాత్రలో ఎస్పీ చరణ్ నటించారు. నవాబ్ షా కీలక పాత్ర పోషించారు. శ్యామ్ కె నాయుడు ఫొటోగ్రఫీ, మణిశర్మ సంగీతం ఆకట్టుకుంటాయి' అని దర్శకుడు చెప్పారు. త్వరలో సినిమాను విడుదల చేస్తామని నిర్మాతలు చెప్పారు.

అమరావతికి ఆహ్వానం



శివ కంఠమనేని, ధన్యా బాలకృష్ణ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కుతోన్న చిత్రం 'అమరావతికి ఆహ్వానం'. చిత్రీకరణ మొదలైంది. లైట్ హౌస్ సినీ మేజిక్ పతాకంపై కేఎస్ శంకర్ నిర్మిస్తున్నారు. జి. వెంకట కృష్ణన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఎస్తేర్, హరీష్, భద్రం కీలకపాత్రలు పోషిస్తున్నారు. సంగీతం: విష్ణు భరద్వాజ్, సినిమాటోగ్రఫీ: ప్రభాకర్ రెడ్డి

సస్పెన్స్ థ్రిల్లర్



కృష్ణసాయి, మీనాక్షి జైస్వాల్ జంటగా రూపుదిద్దుకున్న 'జ్యూయెల్ థీఫ్' చిత్రం సెన్సార్ పూర్తయింది. ప్రేమ, అజయ్, పృథ్వీ, శివారెడ్డి తదితరులు నటించిన ఈ సినిమాను పీఎస్ నారాయణ దర్శకత్వంలో మల్లెల ప్రభాకర్ నిర్మించారు. ఈ సందర్భంగా కృష్ణసాయి మాట్లాడుతూ 'ఇదో సస్పెన్స్ థ్రిల్లర్. యువతకు బాగా నచ్చుతుంది. శ్రీలేఖ అందించిన పాటలు ఆకట్టుకుంటాయి. యాక్షన్ పార్ట్ హైలైట్ అవుతుంది' అని చెప్పారు.

ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో షార్ట్ టర్మ్ కోర్సులు



పుణెలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టీఐఐ) ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ ఓపెన్ లెర్నింగ్- షార్ట్ టర్మ్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఆంగ్ల మాధ్యమంలో తరగతులు నిర్వహించినప్పటికీ హిందీ మాధ్యమంలోనూ వివరణ ఇస్తారు. నిబంధనల ప్రకారం కోర్సులు పూర్తిచేసినవారికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు. • వెబ్‌సైట్: ftii.ac.in

బేసిక్ కోర్స్ ఇన్ డిజిటల్ ఫిల్మ్ మేకింగ్

కోర్సు వ్యవధి అయిదు రోజులు. మొత్తం 45 సీట్లు ఉన్నాయి. ఈ కోర్సుని పిల్లలకు ఉద్దేశించారు. నవంబరు 4 నుంచి ప్రతిరోజూ ఉదయం పది గంటల నుంచి సాయంత్రం అయిదు వరకు తరగతులు నిర్వహిస్తారు. కనీసం ఆరోతరగతి ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. వయసు నవంబరు 1 నాటికి 11 నుంచి 18 ఏళ్ల మధ్య ఉండాలి. ఈ కోర్సులో ఫండమెంటల్స్ ఆఫ్ ఫిల్మ్ మేకింగ్, ఫిల్మ్ లాంగ్వేజ్ అండ్ స్టోరీ టెల్లింగ్ టెక్నిక్స్, సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్, పోస్ట్ ప్రొడక్షన్, ఆర్కైవల్ టెక్నిక్స్ తదితర అంశాలు బోధిస్తారు.
- **కోర్సు ఫీజు:** రూ.7000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 14

ఫౌండేషన్ కోర్స్ ఇన్ స్క్రీన్‌ప్లే రైటింగ్

కోర్సు వ్యవధి పదకొండు రోజులు. మొత్తం 24 సీట్లు ఉన్నాయి. ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. వయసు నవంబరు 1 నాటికి 18 ఏళ్లు నిండి ఉండాలి. ఈ కోర్సులో షార్ట్ ఫిల్మ్ స్ట్రక్చర్, రైటింగ్ ఫర్ స్క్రీన్‌ప్లే, టైమింగ్ ఇన్ సినిమా, అరిస్టాటిల్ పొయిటిక్స్ ఫర్ స్క్రీన్ రైటర్స్, సీన్ కన్‌స్ట్రక్షన్, బిల్డింగ్ ఆఫ్ క్యారెక్టర్స్, మిస్టరీ/సస్పెన్స్/సర్‌ప్రైజ్/ఐరనీ టూల్స్, డెవలపింగ్ షార్ట్ ఫిల్మ్ స్టోరీ అండ్ స్క్రీన్‌ప్లే తదితర అంశాలు బోధిస్తారు. నవంబరు 11 నుంచి ప్రతిరోజూ ఉదయం పది గంటల నుంచి సాయంత్రం అయిదు వరకు తరగతులు నిర్వహిస్తారు.
- **కోర్సు ఫీజు:** రూ.17,500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 21

బేసిక్ కోర్స్ ఆన్ స్మార్ట్‌ఫోన్ డాక్యుమెంటరీ

కోర్సు వ్యవధి ఎనిమిది రోజులు. మొత్తం 40 సీట్లు ఉన్నాయి. ఇంటర్ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. వయసు అక్టోబరు 1 నాటికి 18 ఏళ్లు నిండి ఉండాలి. ఈ కోర్సులో స్మార్ట్‌ఫోన్‌తో ఫిల్మ్ మేకింగ్, ఎడిటింగ్ విధానాలు; క్వాలిటీ వీడియోలు తీయడం; ఫోన్‌ను వీడియో కెమెరాగా

దిక్సూచి
DIKSUCHI

వినియోగించడం; సోషల్ మీడియాలో పోస్ట్ చేసేవిధంగా డాక్యుమెంటరీలు, షార్ట్ వీడియోలు తీయడం; డాక్యుమెంట్ మెమొరీస్ తదితర అంశాలు నేర్పిస్తారు. అక్టోబరు 20 నుంచి తరగతులు ప్రారంభమౌతాయి.
- **కోర్సు ఫీజు:** రూ.9,800
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 30

బేసిక్ యాక్టింగ్ వర్క్‌షాప్

ఈ కోర్సుని పిల్లలకు ఉద్దేశించారు. దీని వ్యవధి పదకొండు రోజులు. రోజుకు రెండు బ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఉదయం తొమ్మిదిన్నర నుంచి మధ్యాహ్నం పన్నెండున్నర వరకు ఒక బ్యాచ్, మధ్యాహ్నం ఒకటిన్నర నుంచి సాయంత్రం నాలుగున్నర వరకు మరో బ్యాచ్ నిర్వహిస్తారు. బ్యాచ్‌కు 25 చొప్పున మొత్తం 50 సీట్లు ఉన్నాయి. కనీసం మూడో తరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎనిమిది నుంచి పన్నెండేళ్ల మధ్య వయసున్న పిల్లలు ఉదయం బ్యాచ్‌కు, పదమూడు నుంచి పదిహేడేళ్ల మధ్య వయసున్నవారు సాయంత్రం బ్యాచ్‌కు హాజరు కావాలి. ఈ కోర్సులో థియేటర్ గేమ్స్, ఇంప్రూవైజేషన్, స్టోరీ టెల్లింగ్, స్టోరీ రైటింగ్, ఇమాజినేషన్, నవరసాలు, సీన్‌వర్క్, వాయిస్ అండ్ బ్రీతింగ్, అవేర్‌నెస్, మెమొరీ, కెమెరా వర్క్, ఆడిషన్ టెక్నిక్స్, ఆడిషన్ ప్రాక్టీస్, మ్యూజిక్ బేస్డ్ ఇమాజినేషన్ తదితర అంశాలు నేర్పిస్తారు. అక్టోబరు 29 నుంచి తరగతులు ప్రారంభమౌతాయి.
- **కోర్సు ఫీజు:** రూ.10,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 7

సీడీఎఫ్‌డీలో రీసెర్చ్ స్కాలర్స్ ప్రోగ్రామ్

హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ డీఎన్‌ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్(సీడీఎఫ్‌డీ)- 'రీసెర్చ్ స్కాలర్స్ ప్రోగ్రామ్(పీహెచ్‌డీ)-1-2025'లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ కోర్సులో డీఎన్‌ఏ ఫింగర్‌ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్, మోడర్న్ బయాలజీ సంబంధిత అంశాలపై రీసెర్చ్ వర్క్ ఉంటుంది. ఇది పూర్తిగా రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. అభ్యర్థులు కోర్సు పూర్తయ్యే వరకు క్యాంపస్‌లోనే ఉండాలి. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా రెండు రౌండ్లు ఉంటాయి. నిబంధనల ప్రకారం షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు వీడియో కాన్ఫరెన్స్ ఇంటర్వ్యూ, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు. కోర్సులో చేరినవారికి రీజనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ(ఆర్‌సీబీ)లో పీహెచ్‌డీ చేసే అవకాశం కల్పిస్తారు.

రీసెర్చ్ విభాగాలు: సెల్ అండ్ మాలిక్యులర్ బయాలజీ, కంప్యూటేషనల్ బయాలజీ, డిసీజ్ బయాలజీ, జెనెటిక్స్, మాలిక్యులర్ మైక్రో బయాలజీ, ఇమ్యూనాలజీ.

అర్హతలు: సైన్స్, టెక్నాలజీ, అగ్రికల్చర్ విభాగాల్లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసినవారు; ఎంబీబీఎస్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. చివరి సెమిస్టర్ పరీక్షలు రాసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. సీఎస్‌ఐఆర్/యూజీసీ/డీబీటీ/ ఐసీఎంఆర్/ఇన్‌స్పైర్/జెస్ట్/యూజీసీ-ఆర్‌జీఎన్‌ఎఫ్ నుంచి జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌నకు అర్హత పొంది ఉండాలి. జేఆర్‌ఎఫ్ అర్హత లేని అభ్యర్థులను ఇంటర్వ్యూకి అనుమతించరు. ఐసీఎంఆర్ నుంచి రెండేళ్ల ఫండెడ్ ప్రాజెక్ట్ స్కీమ్ కింద జేఆర్‌ఎఫ్ పొందినవారు, బీటెక్(బయోటెక్నాలజీ) పూర్తిచేసి డీబీటీ జేఆర్‌ఎఫ్ నెట్ అర్హత ఉన్నవారు, డీబీటీ-బీ కేటగిరీ కింద జేఆర్‌ఎఫ్ నెట్ రాసినవారు, సీఎస్‌ఐఆర్-యూజీసీ(నెట్) ద్వారా ఎల్‌ఎస్ అర్హత పొందినవారు దరఖాస్తుకు అనర్హులు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 11
- **వెబ్‌సైట్:** www.cdfd.org.in

ఐఐటీ మద్రాస్‌లో ఈఎంబీఏ

మద్రాస్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీఎం) నిర్వహిస్తున్న డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(డీఓఎంఎస్) - ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ(ఈఎంబీఏ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఆప్టిట్యూడ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. దీనిని వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ప్రత్యేకించారు. వారాంతాల్లో క్లాస్ రూమ్ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌లు ఉంటాయి. మూడు ప్రాజెక్ట్ వర్క్‌లు పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్‌లో భాగంగా కేస్ డిస్కషన్స్, సమ్మర్ ఇంటర్న్‌షిప్, ఎలక్టివ్ కోర్సులు ఉంటాయి. తొమ్మిది రోజుల ఇంటర్నేషనల్ ఇమ్మర్షన్ లెర్నింగ్ కోర్సు జతగా ఉంటుంది. ఇది 'గ్లోబల్ లీడర్‌షిప్ అండ్ కల్చరల్ ఇంటెలిజెన్స్'కు సంబంధించి ఉంటుంది. దీనిని బ్రస్సెల్స్-బెల్జియం; లిల్లీ & పారిస్-ఫ్రాన్స్‌లోని ఎస్‌ఈజీ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ క్యాంపస్‌లలో నిర్వహిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమశ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. డిసెంబరు 31 నాటికి కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 20
- **వెబ్‌సైట్:** doms.iitm.ac.in

అనారోగ్యంతో పోలీసు జాగిలం ఫాక్సీ మృతి


పోలీసు జాగిలం ఫాక్సీకి నివాళులర్పిస్తున్న ఎస్పీ తుషార్ డూడి, పోలీసు అధికారులు

బాపట్ల, సెప్టెంబరు 25: బాపట్ల జిల్లా భద్రతా విభాగంలో 2022 నుంచి విశేష సేవలందించిన పోలీసు ట్రాకర్ జాగిలం ఫాక్సీ అనారోగ్యంతో మృతి చెందింది. 5.3 సంవత్సరాల వయస్సు కలిగిన ఫాక్సీ మృతిపై ఎస్పీ తుషార్ డూడి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం డాగ్ కెన్నెల్ భవనం వద్ద ఫాక్సీ కళేబరానికి పుష్పాంజలి ఘటించారు. గౌరవవందనం చేసి ఘనంగా నివాళులర్పించారు. పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీసులకు ట్రాకర్ విభాగంలో 2 ఏళ్లపాటు విశేష సేవలందించిందనీ, ఫాక్సీ జాగిలం మృతి చెందటం బాధాకరమన్నారు. పోలీసు కుటుంబ సభ్యుల్లో ఒకరిగా ఫాక్సీ జాగిలంను భావించామన్నారు. నేరాలు ఛేధించటంలో చురుగ్గా, సమర్థవంతంగా పని చేసిందన్నారు. డాబర్‌మెన్ ఆడజాతికి చెందిన ఫాక్సీ జాగిలం 8 నెలలపాటు మంగళగిరి ఏపీఎస్పీ 6వ బెటాలియన్‌లో ట్రాకర్ విభాగంలో శిక్షణ పొందిందన్నారు. 2020 మార్చి 31న శిక్షణ పూర్తి చేసుకొని ఉమ్మడి గుంటూరు జిల్లా రూరల్ విభాగంలో విధులు నిర్వహించిందన్నారు. ఆ సమయంలో మంగళగిరిటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన రేప్ అండ్ మర్డర్ కేసును ఛేధించటంలో కీలకంగా వ్యవహరించిందన్నారు. 2021లో మంగళగిరిలో జరిగిన 27వ బ్యాచ్ రిఫ్రెష్ ట్రైనింగ్‌లో ట్రాకర్ విభాగంలో మొదటి స్థానం పొంది మెడల్ సాధించిందన్నారు. ఏఆర్ కానిస్టేబుల్ యు.ఏడుకొండలు జాగిలానికి హ్యాండ్లర్‌గా వ్యవహరించారన్నారు. అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, ఏఆర్‌డీఎస్పీ చంద్రమోహన్, అడ్మిన్ ఆర్ఐ షేక్.మౌలుద్దీన్, వెల్ఫేర్ ఆర్ఐ శ్రీనివాసరెడ్డి తదితరులు నివాళులర్పించారు.

గుంటూరు మీదగా భువనేశ్వర్ - యశ్వంత్‌పూర్ ప్రత్యేక రైళ్లు

గుంటూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాబోయే దసర, దీపావళి పండగల సెలవుల దృష్ట్యా గుంటూరు మీదగా భువనేశ్వర్, యశ్వంత్‌పూర్‌కు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు గుంటూరు డీఆర్ఎం ఎం.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 02811 భువనేశ్వర్ - యశ్వంత్‌పూర్ ప్రత్యేక రైలు అక్టోబరు 5, 12, 19, 26, నవంబరు 2, 9, 16, 23, 30(ప్రతీ శనివారం) తేదీలలో రాత్రి 7.15కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.35కి గుంటూరు, 9.20కి నరసరావుపేట, ఆదివారం అర్ధరాత్రి దాటాక 12.15కి యశ్వంత్‌పూర్ చేరుకొంటుంది. నంబరు 02812 యశ్వంత్‌పూర్ - భువనేశ్వర్ ప్రత్యేక రైలు అక్టోబరు 7, 14, 21, 28, నవంబరు 4, 11, 18, 25, డిసెంబరు 2 తేదీల్లో(ప్రతీ సోమవారం) వేకువజామున 4.30 గంటలకు బయలుదేరి రాత్రి 6.29కి నరసరావుపేట, 7.20కి గుంటూరు మంగళవారం మధ్యాహ్నం 12.15కి భువనేశ్వర్ చేరుకొంటుందని తెలిపారు.

నేటి నుంచి జిల్లా జట్ల ఎంపికలు

గుంటూరు(విద్య), సెప్టెంబరు 25: ఉమ్మడి జిల్లాలో ఈనెల 26 నుంచి వివిధ క్రీడాంశాల్లో జిల్లా జట్ల ఎంపికలు జరుగుతాయని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి మెల్లంపూడి రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 26న సెపక్ తక్రా అండర్ 14, అండర్ 17 బాలబాలికల విభాగాలకు జడ్పీ స్కూల్ నందిగామ(సత్తెనపల్లి)లో నిర్వహిస్తారు. 27న అథ్లెటిక్స్ ఎంపికలు జడ్పీ స్కూల్ నంబూరులో అండర్ 14, అండర్ 17 బాలబాలికల ఎంపిక జరుగుతుంది. 28న బాక్సింగ్ అండర్ 14, అండర్ 17 బాల బాలికల విభాగాలలో ఏఎంజీ హైస్కూల్ చిలకలూరిపేటలో, బాస్కెట్‌బాల్ అండర్ 14, అండర్ 17 బాలురుకు మాత్రమే ఏఎంజీ హైస్కూల్ చిలకలూరిపేటలో, 28న వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ అండర్ 17, అండర్ 19 విభాగాల్లో బాల బాలికలకు డీఎస్ఏ స్టేడియం తెనాలిలో నిర్వహిస్తారని తెలిపారు. క్రీడాంశాల్లో పాల్గొనే విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్, ఆధార్, పుట్టిన తేదీ సర్టిఫికెట్ తీసుకురావాలని సూచించారు.

శీలంవారివీధిలో వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు, సెప్టెంబరు 25: కొత్తపేట శీలంవారి వీధిలో మురళి శ్రీనివాసరావు (54) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతికి అనారోగ్యం, ఆదరణ కరవవ్వడమేనని పోలీసులు తెలిపారు. శ్రీనివాసరావు మొదటి భార్యకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చి విడాకులు తీసుకున్నారు. ఇద్దరు కుమార్తెలు తల్లి వద్దే ఉంటున్నారు. శ్రీనివాసరావు మరో వివాహం చేసుకోగా ఆమెకు ముగ్గురు కుమార్తెలు సంతానం కలిగారు. వారిద్దరి మధ్య కూడా మనస్పర్థలు రావడంతో విడిపోయారు. శ్రీనివాసరావు గతంలో హైదరాబాద్, గుంటూరులో సెక్యూరిటీ గార్డుగా పని చేసేవాడు. ఆయనకు మధుమేహ వ్యాధి ఉండటంతో ఇటీవల కాలుకు దెబ్బతగిలి నడవలేక మంచానికి పరిమితమయ్యాడు. ఈ క్రమంలో తన అన్న భోజనం పెడుతుండే వాడు. ఆరోగ్యం దెబ్బతినడం, కుటుబ సభ్యుల నిరాదరణ వంటి కారణాలతో మనస్తాపానికి గురై సూసైడ్ లెటర్ రాసి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సోదరుడు రామకృష్ణ ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బదిలీల్లో ఉద్యోగులకు తీవ్ర అన్యాయం

- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న అధికారులు


డిప్యూటీ సీఈవోకు వినతి పత్రం అందజేస్తున్న అంధ ఉద్యోగి ఇళయరాజా

గుంటూరు సిటీ, సెప్టెంబరు 25: గుంటూరు జిల్లా పరిషత్‌లో పనిచేస్తున్న ఒక అధికారికి చూపు బాగానే కనిపిస్తుంది. అయినా ఆయనకు చూపు లేదన్న పేరుతో గుంటూరు రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో చోటు కల్పించారు. అందుకోసం నిబంధనలు, జీవోలను అడ్డం పెట్టారు. పొన్నూరు మండలం నిడుబ్రోలు జెడ్పీ పాఠశాలలో అటెండర్‌గా పనిచేసే బత్తుల ఇళయరాజా నూరుశాతం అంధ ఉద్యోగి. ఆయన్ను దూరంలోని చింతలపూడికి బదిలీ చేశారు. గుంటూరు జిల్లా పరిషత్ ఉద్యోగుల బదిలీల్లో ఇటువంటి ఉదంతాలు తరుచూ జరుగుతున్నాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు ఇచ్చిన సిఫార్సు లేఖలను తుంగలో తొక్కి పోస్టింగ్‌లు ఇచ్చారన్న ఆరోపణలు వస్తున్నాయి. బుధవారం కూడా చాలా మంది ఉద్యోగులు ఎమ్మెల్యే సిఫార్సు లేఖ ఇచ్చినా తమకు అన్యాయం చేశారని ఆరోపిస్తూ జెడ్పీ కార్యాలయానికి వచ్చారు. వినుకొండ నియోజకవర్గంలోని ఈపూరు మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పి.రవికుమార్‌ను రొంపిచర్ల మండలానికి బదిలీ చేశారు. రవికుమార్‌ను ఈపూరులోనే కొనసాగించాలని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు లేఖ ఇచ్చారు. అంతేకాకుండా రవికుమార్ ఎన్‌జీవో అసోసియేషన్‌లో కూడా ఉన్నారు. అయినా బదిలీ చేసి చేతులు దులుపుకున్నారు.

అన్ని లేఖల పరిస్థితి అంతే...

పి.వెంకట రాజారాం కారంపూడి ఎంపీడీవో కార్యాలయంలో టైపిస్టుగా పని చేస్తున్నారు. ఆయన్ను జెడ్పీలోని పంచాయతీరాజ్ కార్యాలయానికి బదిలీ చేయాలని పెదకూరపాడు ఎమ్మెల్యే లేఖ ఇచ్చారు. మరో ముఖ్యమైన నేత కార్యాలయం నుంచి కూడా సిఫార్సు చేశారు. ఆ విజ్ఞప్తిని పూర్తిగా బుట్ట దాఖలు చేశారు. సదరు ఉద్యోగి ముఖ్యనేత కార్యాలయంలో ఈ విషయంపై ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ముఖ్యమంత్రి కార్యాలయానికి కూడా జెడ్పీ బదిలీల్లో జరిగిన అవకతవకలపై ఫిర్యాదు లు వెళ్లాయి. కొందరు ప్రజాప్రతినిధులు రాత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

అక్టోబర్ 2 వరకు ఉండాల్సిందే..

జెడ్పీ బదిలీల్లో కీలకంగా ఉన్న డిప్యూటీ సీఈవో మోహన్‌రావు నెల్లూరుకు బదిలీ అయిన నేపథ్యంలో బుధవారం రిలీవ్ అయ్యేందుకు సిద్ధ పడ్డారు. అయితే కలెక్టర్ కార్యాలయం నుంచి రిలీవ్ చేయవద్దని ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. అక్టోబర్ 2 తర్వాత రిలీవ్ చేయాలని ఆదేశించినట్లు సమాచారం.

చిన నారాయణమ్మకు ఘన నివాళి

- పెద్దకర్మకు హాజరైన ప్రముఖులు


చిన నారాయణమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రతిపాటి పుల్లారావు, మంత్రులు, ఎంపీలు, శాసనసభ్యులు, ప్రముఖులు

చిలకలూరిపేట, సెప్టెంబరు 25: స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు మాతృమూర్తి చిన నారాయణమ్మ పెద్దకర్మను పురస్కరించుకుని పలువురు మంత్రులు, శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు బుధవారం చిలకలూరిపేటకు తరలివచ్చారు. ప్రత్తిపాటి గార్డెన్స్‌లో చిన నారాయణమ్మ చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. చిన నారాయణమ్మ కుమారుడు ప్రత్తిపాటి పుల్లారావు, కోడలు వెంకటకుమారితోపాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జీవీ ఆంజనేయులు, బూర్ల రామాంజనేయులు, చదలవాడ అరవిందబాబు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, చింతమనేని ప్రభాకర్, తెనాలి శ్రావణ్ కుమార్, కొలికపూడి శ్రీనివాసరావు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు టీడీ జనార్దన్, మాజీ ఎంపీ కంభంపాటి రామమోహనరావు, మాజీ శాసనసభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి, మక్కెన మల్లికార్జునరావు, బొల్లినేని వెంకటరామారావు, నన్నపనేని రాజకుమారి, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, దర్శి నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, సినీ నిర్మాత, నటుడు కొల్లా అశోక్‌కుమార్, సహా పలువురు ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. చిన నారాయణమ్మ పెద్దకర్మ సందర్భంగా వేలాదిమందికి ప్రత్తిపాటి గార్డెన్స్‌లో భోజన ఏర్పాట్లు చేశారు. పట్టణంతోపాటు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వేలాదిమంది తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు కార్యక్రమానికి తరలివచ్చారు.

సచ్చిదానందమూర్తి నేటి తరానికి స్ఫూర్తి

- నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు


ప్రసంగిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, వేదికపై ఆచార్య గంగాధర్‌రావు, త్రిమూర్తులు

పెదకాకాని, సెప్టెంబరు 25: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పద్మవిభూషణ్ ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి పేరిట ప్రత్యేక పోస్టల్ కవర్‌ను నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు విడుదల చేశారు. కార్యక్రమానికి నందమూర్తి సెంటర్ ఫర్ స్టడీస్ ఇన్ ఆఫ్రో ఏషియన్ ఫిలాసఫీస్ డైరెక్టర్ ఆచార్య త్రిమూర్తిరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో జన్మించిన గొప్ప తత్వవేత్త సచ్చిదానందమూర్తి అని కొనియాడారు. ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తి అని, నేటి యువత ఆయన సూచించిన రాడికల్ ఫిలాసఫీని అనుసరించాలని సూచించారు. వర్సిటీ ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు మాట్లాడుతూ కొత్త సచ్చిదానందమూర్తి తత్వశాస్త్రానికి కొత్త భాష్యం చెప్పిన ప్రఖ్యాత తత్వవేత్త అని, భారతీయ తత్వ శాస్త్రాన్ని విశ్వవ్యాప్తం చేశారని పేర్కొన్నారు. విజయవాడ ప్రాంతీయ పోస్ట్ మాస్టర్ జనరల్ డీఎస్‌వీఆర్ మూర్తి మాట్లాడుతూ భారతీయ తత్వవేత్తల్లో ప్రముఖులైన ఆచార్య కొత్తా సచ్చిదానందమూర్తి పేరిట ప్రత్యేక పోస్టల్ కవర్లను విడుదల చేయడం గొప్ప విషయం అన్నారు. రెక్టార్ ఆచార్య కె.రత్న షీలా మణి మాట్లాడుతూ కొత్త సచ్చిదానందమూర్తి ఎన్నో గ్రంథాలను ఆంగ్లం, తెలుగు, హిందీలో కూడా రచించారన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో విద్యార్థులు కొత్త సచ్చిదానందమూర్తి బోధనలను తమ జీవితంలో అనువదించుకోవాలని సూచించారు. వర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య సీహెచ్. స్వరూపారాణి, ఆచార్య కె.వీరయ్య , ఆచార్య పి.సిద్దయ్య, ఆచార్య ఏ ప్రమీలా రాణి, అధ్యాపక సంఘం, సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.6 కోట్ల విలువైన భవనం ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్


మంత్రి మనోహర్‌కు రిజిస్ట్రేషన్ దస్తావేజులు అందజేస్తున్న కస్తూరిభాయ్

తెనాలి రూరల్, సెప్టెంబరు 25: మహిళా మండలి నెలకొల్పి దాని ద్వారా అనేక మందికి సహాయ సహకారాలందిస్తూ వృద్ధాప్యం దరిచేరడంతో సుమారు రూ.6 కోట్ల వివలువజేసే ఆ భవనాన్ని ప్రభుత్వానికి అందించి ముద్దన కస్తూరిభాయ్ గొప్పమనస్సును చాటుకున్నారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. పట్టణంలోని కొత్తపేటలో మహిళా మండలి భవనాన్ని బుధవారం ముద్దన కస్తూరిభాయ్ మంత్రి నాదెండ్ల మనోహర్ సమక్షంలో ప్రభుత్వానికి రాసి రిజిస్ట్రేషన్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ ఆమెను అభినందించారు. మనోహర్ మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి కస్తూరిభాయ్ ఎనలేని సేవలందించారన్నారు. రూ.6 కోట్ల విలువజేసే భవనాన్ని మంచి ప్రభుత్వానికి అందించాలన్న ఆకాంక్షతో దానిని కాపాడుకుంటూ వచ్చి, నేడు కూటమి ప్రభుత్వానికి అందించారని, ఆమె మంచి మనస్సుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కస్తూరి భాయ్ మాట్లాడుతూ మహిళా మండలి ద్వారా మహిళల అభ్యున్నతికి కృషి చేశామని తెలిపారు. తనకు వృద్ధాప్యం దరిచేరడంతో మంచి ప్రభుత్వానికి భవనాన్ని రాసి ఇచ్చి మహిళల శ్రేయస్సుకు, మంచి కార్యక్రమాలకు వినియోగించేలా అప్పగించాలని భావించినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భవనాన్ని అప్పగించాలని నిర్ణయించుకుని మంత్రి మనోహర్, అధికారుల సమక్షంలో రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిపారు. తొలుత మంత్రి మనోహర్ ఆమెపై పూలు చల్లుతూ భవనంలోకి ఘన స్వాగతం పలికారు. జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ, సబ్‌కలెక్టర్ సంజనాసింహ, తహసీల్దార్ గోపాల కృష్ణ, మున్సిపల్ కమిషనర్ శేషన్న, అధికారులు పాల్గొన్నారు

చోరీ కేసుల దర్యాప్తులో పురోగతి

- మూడు దొంగతనాలకు పాల్పడింది వేర్వేరు ముఠాలు
- నిందితుల కోసం రంగంలోకి ప్రత్యేక బృందాలు

గుంటూరు, సెప్టెంబరు 25: కేవలం మూడు రోజుల్లో మూడు దొంగతనాలకు పాల్పడి నగరవాసులను కలవరానికి గురిచేసిన కేసుల దర్యాప్తులో పోలీసులు పురోగతి సాధించారు. రెండు చోరీ కేసుల్లో నిందితులను ఇప్పటికే పోలీసులు గుర్తించగా, మూడో కేసులో నిందితులను గుర్తించేందుకు అనుమానితుల జాబితాను తిరగేస్తున్నారు. అపార్టుమెంట్‌లో విశ్రాంత డీఎస్పీ జి. పెంచలనాయుడు ఇంటిలో జరిగిన చోరీకి నిందితులు కారులో వచ్చారు. వారు కింద నుంచి పైవరకు రెండు దఫాలు తిరగడంతో సీసీ కెమెరాల్లో స్పష్టంగా వారి అనువాళ్లు కనిపించాయి. ఈ చోరీకి పాల్పడిన ఇద్దరు వరుసకు అన్నదమ్ములని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. వీరిలో ఒకరు హైదరాబాదులో ఉంటుండగా, మరొకరు మహారాష్ట్రలో ఉంటున్నట్లు తేలింది. కారులో వచ్చి చోరీకి పాల్పడిన అనంతరం నిందితులు నేరుగా హైదరాబాద్ వెళ్లి అక్కడి నుంచి తిరిగి మహారాష్ట్రకు వెళ్లినట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. ఈ క్రమంలో హైదరాబాదులో ఉంటున్న ఓ నిందితుడి కుటుంబ సభ్యులను పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వారు ఇటీవలే ఆ కారును కొనుగోలు చేసినట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. వీరు కర్ణాటక వెళ్లాక సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేయడంతో వారి కదలికలు ప్రశ్నార్థకంగా మారాయి. దీంతో వారిని అదుపులోకి తీసుకునేందుకు పోలీసు బృందాలు తరలివెళ్లాయి. వీరు గుంటూరులో చోరీ చేయడానికి ముందు ముంబాయిలోనూ, ఆ తరువాత విశాఖపట్నంలోనూ చోరీ చేసినట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. పరిస్థితులను బట్టి వీరు విమానాల్లోనూ తిరుగుతుంటారని తెలిసింది. గతంలో వీరు హైదరాబాద్‌లో ఎనిమిది కిలోల బంగారం చోరీ చేసిన కేసులోనూ పట్టుబడ్డారు. ఎస్వీఎన్ కాలనీలో ఫైనాన్స్ వ్యాపారి శంకర్ ఇంటిలో ఐదు రోజుల క్రితం పట్ట పగలు జరిగిన చోరీ కేసులో కొంత పురోగతి సాధించారు. నిందితుడిని రాజమండ్రికి చెందిన శామ్యూల్‌రాజ్‌గా గుర్తించారు. అయితే ప్రస్తుతం నిందితుడు వేరే రాష్ట్రానికి వెళ్లినట్లు అనుమానిస్తున్నారు. చోరీకి పాల్పడిన నిందితుడు విజయవాడ వెళ్లి అక్కడ నుంచి రైలులో వేరే రాష్ట్రానికి వెళ్లినట్లు తెలుస్తోంది. నిందితుడు వీధులవెంట తిరుగుతూ, పొలాల్లో నిద్రిస్తూ చోరీలు చేస్తుంటాడని పోలీసులు అంటున్నారు. కేరాఫ్ లేకపోవడంతో ఇతన్ని పట్టుకోవడం కొంత ఇబ్బందిగా ఉంటుందని పోలీస్ వర్గాలు అంటున్నాయి. ఎస్వీఎన్ కాలనీలోని బాంబే డయింగ్ కాలనీలో గల విశ్రాంత తపాలా ఉద్యోగి సూర్యనారాయణ ఇంటిలో జరిగిన చోరీ కేసులో నిందితులను గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

జగన్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

వినుకొండ, సెప్టెంబరు 25: దొంగ యాత్రలు, ఆలయ ప్రదర్శనలు చేస్తే చేసిన పాపాలు ఊరికే పోవని, సాక్షాత్తూ కలియుగ వైకుంఠ స్వామికి ద్రోహం చేసిన జగన్‌రెడ్డి ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు డిమాండ్ చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ రెడ్డి తిరుమల తిరుపతిలో చేయరాని పాపాలు చేశారని తెలిపారు. సంప్రదాయాలను తుంగలో తొక్కి కోట్లాది భక్తులు ఎంతో పవిత్రంగా భావించే తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ చేసి పెద్ద నేరానికి పాల్పడ్డారన్నారు. వైసీపీ పాలనలో తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలిలో అన్య మతస్థులను పెట్టారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వాన్ని అడ్డంపెట్టుకుని తిరుమలలో దోపిడీ చేశారని ఆరోపించారు. జగన్ రెడ్డి అవినీతి, స్వార్థం కోసం భక్తుల మనోభావాలను దెబ్బతీశారన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మాట్లాడుతూ కేవలం మూడు నెలల్లోనే వినుకొండ పట్టణం అభివృద్ధి జీవీ ఆంజనేయులు కృషి చేయడం ద్వారా జరుగుతుందని తెలిపారు. పి.వి. సురేష్ పత్తిపూర్ణ, మురళీకృష్ణ యాదవ్, కుంటా కోటిరెడ్డి పాల్గొన్నారు.

వైరల్ ఫీవర్లపై సర్వే

- డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి వెల్లడి



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు (మెడికల్) సెప్టెంబరు 25: జిల్లాలో ప్రబలిన కాక్‌టెయిల్ వైరల్ ఫీవర్ల వ్యాప్తిని తెలుసుకొనేందుకు ఎపిడమియాలజికల్ సర్వే చేపడుతున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి వెల్లడించారు. వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సంభవిస్తున్న మిక్స్‌డ్ ఫీవర్లలో డెంగీ, చికున్ గున్యా, మలేరియా తదితర జ్వరాలను గుర్తించేందుకు, శాస్త్రీయ పరిష్కారాలను సూచించేందుకు ఈ సర్వే దోహదపడుతుందని ఆమె తెలిపారు. బుధవారం తన ఛాంబర్‌లో ఆమె వైరల్ ఫీవర్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. "కాక్‌టెయిల్ వైరస్ కలకలం" శీర్షికన ఈ నెల 24వ తేదీన ఆంధ్రజ్యోతి ప్రధాన సంచికలో వెలువడిన కథనంపై డీఎంహెచ్‌వో స్పందించారు. బాధితుల్లో పలు రకాల వైరల్ ఫీవర్ లక్షణాలు కనిపిస్తున్నట్లు ప్రచురించగా, వీటిపై అధ్యయనం చేసేందుకు ఆమె చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గుంటూరు వైద్య కళాశాల సామాజిక వ్యాధి నిరోధక విభాగానికి చెందిన వైద్యనిపుణులతో సమావేశమయ్యారు. ఎస్పీఎం హెచ్‌వోడీ డాక్టర్ ఏ.సీతారామ్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ తేజ్‌కుమార్, డాక్టర్ సాయి శ్రీనివాస్, డాక్టర్ సుగుణరాజు తదితరులు పాల్గొన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ గుంటూరు వైద్య కళాశాల సోషల్ అండ్ ప్రివెంటివ్ మెడిసిన్ వైద్యనిపుణులతో పాటు ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసి తుళ్లూరు, తాడేపల్లి, మంగళగిరి మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఫీవర్ సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. పిడిడమియాలజిస్ట్ డాక్టర్ వరప్రసాద్, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, డెమో ఏ జయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడుగా అంబటి

- పల్నాడు బాధ్యతలు మళ్లీ పిన్నెల్లికే..

గుంటూరు, సెప్టెంబరు 25: సార్వత్రిక ఎన్నికల తరువాత పూర్తి నిస్సత్తువలో ఉన్న వైసీపీకి జిల్లాల అధ్యక్షుల నియామకాలను చేపట్టారు. గుంటూరు జిల్లా అధ్యక్షుడుగా మాజీ మంత్రి అంబటి రాంబాబు, పల్నాడు జిల్లా అధ్యక్షుడుగా వ్యవహరిస్తున్న మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికే మరోసారి బాధ్యతలు అప్పగించారు. ఇక గుంటూరు, పల్నాడు జిల్లాలకు పార్టీ పరిశీలకుడుగా మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డిని నియమించారు. మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా దొంతిరెడ్డి వేమారెడ్డిని నియమిస్తూ జగన్ ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా నేతలతో తాడేపల్లి కార్యాలయంలో మాజీ సీఎం జగన్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మాజీ మంత్రులు విడదల రజనీ, మేకతోటి సుచరిత, అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైసీపీ నేతలు మందపాటి శేషగిరిరావు, షేక్ నూరిఫాతిమా, అంబటి మురళి హాజరైయ్యారు.

ఏఎన్ఎంలకు ఇతర విధులు కేటాయించొద్దు

గుంటూరు సిటీ, సెప్టెంబరు 25: వైద్య, ఆరోగ్య కార్యక్రమాల్లో నిత్యం పని ఒత్తిడితో ఉంటున్న ఏఎన్ఎంలకు ఇతర విధులు కేటాయించవద్దని తెలుగునాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మలినేని భానుమూర్తి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏఎన్ఎంలు సాధారణ టీకాలు, ఫ్రైడే, డ్రైడే, ఆర్‌సీహెచ్, సీజనల్ వ్యాధుల నివారణ కోసం ప్రత్యేక ఆరోగ్య శిబిరాల నిర్వహణ, ఎన్‌సీడీసీడీ సర్వే, జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. అటువంటి తరుణంలో 'ఇది మంచి ప్రభుత్వం' అనే కార్యక్రమంలో ఏఎన్ఎంలను భాగస్వామ్యం చేయడం దారుణమన్నారు. ఎంపీడీవోలు, గ్రామ కార్యదర్శులు కూడా ఇతర సర్వే పనులు ఏఎన్ఎంకు అప్పగిస్తున్నారని అన్నారు. దీనివలన ఫీడర్ క్యాడర్‌కి రావాల్సిన పదోన్నతుల అవకాశాలు తగ్గి ఉద్యోగులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల కు మేలు చేసే 100 శాతం గ్రాస్ శాలరీ జీవోను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులను ఎఫ్ఆర్ఎస్ పేరుతో ఇబ్బందులకు గురిచేసిందనీ, అందువల్లే ఉద్యోగులు కూటమి ప్రభుత్వం రావాలని కోరుకున్నారని అన్నారు.

800 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం


బియ్యం లారీని తనిఖీ చేస్తున్న రూరల్ ఎస్ఐ గండు కిరణ్

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 25: అర్ధరాత్రి గుంటూరు వైపు వెళ్తున్న లారీని పొన్నూరు రూరల్ పోలీసులు అనుమానంతో ఆపి తనిఖీ చేయగా బియ్యం బస్తాలు ఉన్నాయి. అవి రేషన్ బియ్యంగా అనుమానించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రూరల్ సీఐ కోటేశ్వరరావు కథనం ప్రకారం మంగళవారం రాత్రి రూరల్ ఎస్సై గండు కిరణ్ గస్తీ నిర్వహిస్తుండగా చింతలపూడి వద్ద అనుమానాస్పదంగా వెళ్తున్న లారీని ఆపి తనిఖీ చేశారు. బాపట్ల నుంచి తెలంగాణలోని ఖమ్మం జిల్లా మదిరకు బియ్యం లోడు చేసుకుని వెళ్తున్నట్లు డ్రైవర్ సమాధానం ఇచ్చాడు. అయితే ఈ బియ్యం రేషన్ బియ్యంగా అనుమానించి పోలీసులు స్వాధీనం చేసుకుని సివిల్ సప్లయి అధికారులకు సమాచారం అందించారు. సివిల్ సప్లయి డీటీ భువనేశ్వరి లారీలోని బియ్యాని తనిఖీ చేసి నిర్ధారణ కోసం జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. అయితే ప్రాథమిక పరిశీలనలో ఈ బియ్యం రేషన్ బియ్యంను రీసైక్లింగ్ చేసినట్టుగా గుర్తించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి లారీని స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. లారీలో 25 కిలోల చొప్పున 800 బస్తాల బియ్యం విలువ రూ.10 లక్షల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

న్యూరో విభాగానికి రూ.4 లక్షల విరాళం

గుంటూరు (మెడికల్) సెప్టెంబరు 25: ఏపీ న్యూరోసైంటిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి న్యూరాలజీ, న్యూరో సర్జరీ విభాగాలకు చెరో రూ.2 లక్షల చొప్పున రూ.4 లక్షల విరాళం అందజేసింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ పి.విజయ, డాక్టర్ వీర్ తారక్‌నాథ్, డాక్టర్ సీహెచ్ శివరామకృష్ణ తదితరులు ఈ విరాళం జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు అందజేశారు. ఇటీవల గుంటూరులో జరిగిన న్యూరోసైంటిస్ట్‌ల అసోసియేషన్ వార్షికోత్సవ సదస్సు విజయవంతం కావడం వెనుక ప్రభుత్వాస్పత్రి న్యూరాలజీ, న్యూరో సర్జరీ వైద్యనిపుణుల కృషి ఉంది. ఈ నేపథ్యంలో ఆయా విభాగాల అభివృద్ధికి ఈ విరాళం అందజేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. తమకు వచ్చిన రూ.2 లక్షల విరాళంతో న్యూరాలజీ విభాగం వైద్యులు ల్యాప్‌టాప్‌ను కొనుగోలు చేసినట్లు చెప్పారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

51,039 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 51,149 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 51,039 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 26,374 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8500	17000	334	9000	15700
నెంబరు. 5	9000	17000	నెంబరు. 5	9000	11500
273	11500	14000	273	--	--
341	9000	16000	341	9000	16500
4884	12500	13700	4884	13200	15000
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	18600	తేజ	9000	18700
బ్యాడిగి	8000	16000	బ్యాడిగి	9000	15000
దేవనూరు డీలక్స్	8000	16000	దేవనూరు డీలక్స్	13000	16500
తెల్లకాయలు	5500	11500	తెల్లకాయలు	6500	10600

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

వరద బాధితులకు అండగా సీఎం చంద్రబాబు

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, సెప్టెంబరు 25: వరద బాధితులకు అండగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నష్టపరిహారాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమచేశారని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గుంటూరులోని నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ భారీ విపత్తులో బాధితులకు అండగా నిలవటమే కాకుండా ప్రతి క్షణం ప్రజల్లో ఉంటూ బాధితులకు ధైర్యాన్ని ఇచ్చారన్నారు. సహాయ సహకారాలు అందించటంలో చంద్రబాబు నిర్విరామంగా కృషి చేశారన్నారు. నియోజకవర్గంలో వరదల కారణంగా నష్టపోయిన బాధితులకు కూడా నష్ట పరిహారం అందుతుందని ఆయన అన్నారు.

చేయూతనందించిన సాంబశివరావు అభినందనీయుడు



సాంబశివరావును అభినందిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

వరద బాధితులకు, అన్న క్యాంటీన్‌లకు చేయూతనందించిన సాంబశివరావు అభినందనీయులని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ బుధవారం అన్నారు. ఈ సందర్భంగా కాకతీయ విద్యా సంస్థల నిర్వాహకులను, యాజమాన్యాన్ని ఆయన అభినందించారు.

3 నుంచి శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు



బాలచాముండికా అమ్మవారు

అమరావతి, సెప్టెంబరు 25: విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని అక్టోబరు 3వ తేదీ నుంచి ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి ఆలయంలో శ్రీ దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ ఈవో వేమూరి గోపి తెలియజేశారు. ఉత్సవాల్లో అమ్మవారి అలంకరణలతో పాటు శరన్నవరాత్రుల కలశ స్థాపన, అమ్మవారికి త్రికాలార్చన, కుంకుమార్చన, సప్తశతి పారాయణ, 11న చండీ కల్యాణం, హోమం జరుగుతాయని 12న గ్రామోత్సవం, శమీపూజ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. భక్తులు శరన్నవరాత్ర ఉత్సవాల్లో ప్రతిరోజు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

కాలువపై బ్రిడ్జి నిర్మించేందుకు ప్రణాళికలు

● స్థలాన్ని పరిశీలించిన పంచాయతీరాజ్ డీఈ



బలిజేపల్లి సమీపంలో కాలువపై బ్రిడ్జి నిర్మించేందుకు పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ డీఈ శేఖర్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు

రాజుపాలెం, సెప్టెంబరు 25: సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వానికి రెండు కళ్లని మొదటి నుంచి చెబుతున్నట్లుగానే ఆ విధంగానే గ్రామాల్లో అడుగులు వేస్తుంది. స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని బలిజేపల్లి, ఉప్పలపాడు, లక్ష్మీపురం తండా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, నల్లమోతుల శ్రీనివాసరావు(వాసు), సులగా వెంకటప్పయ్య తదితరులు పంచాయతీరాజ్ డీఈ శేఖర్‌బాబు, ఏఈ నరసింహరావులను వెంట తీసుకుపోయి చేయాల్సిన పనులను పరిశీలించారు. అనంతరం లక్ష్మీపురం తండా ప్రధాన రహదారిలో సీసీ రోడ్డు నిర్మాణం నిమిత్తం కొలతల కొలిచి అంచనాలను తయారు చేశారు. చివరిగా ఉప్పలపాడులోని బీసీ కాలనీలో చేపట్టనున్న పనులను పరిశీలించారు. ఆయన వెంట మాజీ సర్పంచులు అల్లంశెట్టి అనందరావు, దుడ్డు అప్పారావు తదితరులున్నారు.

సనాతన ధర్మానికి విఘాతం కలిగిస్తే సహించేది లేదు

● జనసేన నేతలు

మాచర్లటౌన్, సెప్టెంబరు 25: సనాతన ధర్మానికి విఘాతం కలిగిస్తే సహించేది లేదని జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి పులి హరి, మాచర్ల నియోజకవర్గ అధికార ప్రతినిధి నక్షత్రపు ప్రసాదరావు అన్నారు. తిరుపతిలో శ్రీవేంకటేశ్వరస్వామి లడ్డు ప్రసాదంలో జరిగిన అపశృతికి ప్రాయశ్చిత్తంగా ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేపట్టిన 11 రోజుల ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా జనసేన నేతలు బుధవారం పట్టణంలోని వడ్డెర బజారులో గల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని శుద్ధి చేసి స్వామికి నూతన వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో జనసేన నేతలు కృష్ణబాబు, తోటకూర శ్రీనివాసారావు, గుండాల రవి, గుండెబోయిన సాంబశివరావు, షేక్ మదీన్, లాలకృష్ణగౌడ్, మారబోయిన శ్రీహరి, అనిల్, నరేష్, వీరమహిళ వెంకటరమణ, టీడీపీ నేతల కొమెర అనంతరాములు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం సీఎం చంద్రబాబుతోనే సాధ్యం

● టీడీపీ సీనియర్ నేత కేశవరెడ్డి

మాచర్లటౌన్, సెప్టెంబరు 25: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ సీనియర్ నేత యెనుముల కేశవరెడ్డి అన్నారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు బుధవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 5వ వార్డులో ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వ 100 రోజుల పాలనలో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలను అందించారు. అలాగే పట్టణంలోని 6వ వార్డులో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు ఆధ్వర్యాన కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో డేగల కమలాకరరావు, యాకోబు, కందుల రవి, చెరుకుపల్లి వందనకుమార్, డేగల కృపాల్, చింతమళ్ల అడవిరాముడు, బొల్లెద్దుల లూకరాజు, ప్రకాష్, దావీదు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోనూరులో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం

అచ్చంపేట, సెప్టెంబరు 25 : మండలంలోని కోనూరు గ్రామంలో బుధవారం ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ గ్రామ, మండల నాయకులు పాల్గొన్నారు. వంద రోజుల్లో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు వివరించారు. ఈ సందర్భంగా జరిగిన గ్రామ సభ జరిగింది. అధికారులు, నాయకులు ఇంటింటికి వెళ్లి అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. గ్రామ సభలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, మాజీ సర్పంచ్ తాళ్ళూరి లక్ష్మీనారాయణ, చందు, గ్రామ కార్యదర్శి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ఐ ఖోఖో ఎంపికలు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కారంపూడి, సెప్టెంబరు 25: కారంపూడిలోని బ్రహ్మనాయుడు జడ్పీ హైస్కూల్లో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నియోజకవర్గస్థాయి బాలబాలికల ఎంపికలు ముగిసినట్లు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ ప్రధాన కార్యదర్శి స్వర్ణరాజు తెలిపారు. హైస్కూల్లో ఎంపికైన విద్యార్థులతో కలిసి బుధవారం మాట్లాడారు. నియోజకవర్గస్థాయిలో 250 మంది విద్యార్థులు పాల్గొనగా బెస్ట్ టీంను ఎంపిక చేశామన్నారు. వచ్చే నెల ఒకటిన హైస్కూల్లో జిల్లా స్థాయి ఖోఖోలో అండర్-14 బాలబాలికల ఎంపికలు జరుగుతాయన్నారు. పోటీలను క్రీడా కోఆర్డినేటర్లు ఎక్స్‌మాస్ జాన్, బండ్ల ప్రసాద్, కత్తి రవి, వేణు పర్యవేక్షించారన్నారు. హైస్కూల్ ఎస్ఎంసీ ఛైర్మన్ బాలునాయక్, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు మోదీన్‌సా, టీడీపీ నేతలు పుల్లయ్య, లక్ష్మీనారాయణ, అంజయ్య, చప్పిడి రాము, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరు పీహెచ్‌సీలో ఫార్మసిస్టుల దినోత్సవం

క్రోసూరు, సెప్టెంబరు 25: ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవాన్ని క్రోసూరు పీహెచ్‌సీలో బుధవారం నిర్వహించారు. ఆరోగ్య విస్తరణాధికారి శిఖా శ్యామ్‌సన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్యులు రాసిన మందులను అర్థం చేసుకొని వ్యాధిగ్రస్తులకు అందజేయడంలోను, చికిత్సలోను ఫార్మాసిస్టుల పాత్ర అత్యంత కీలక మైనదన్నారు. పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఫార్మసిస్టు పాతిమాను ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు సత్కరించారు. ఫార్మసిస్టులు ఆరోగ్య రక్షణ రంగ వ్యవస్థలో అంతర్భాగమని అన్నారు. కొవిడ్- 19 సమయంలో ఫార్మసిస్టులు ముందు వరుసలో ఉండి ఎంతో సేవ చేశారన్నారు. ఆరోగ్య పర్యవేక్షకులు అమర జ్యోతి, రాణి, ప్రభాకరరావు, ఆరోగ్య సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

నా ధైర్యం ప్రజలే

● కష్టకాలంలోనూ నావెంట నడిచారు
● వరికపూడిశెల సాధించకుంటే రాజకీయాల నుంచి తప్పుకుంటా
● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

వెల్దుర్తి, సెప్టెంబరు 25: నేను మీకు ధైర్యం కాదు.. మీరే నాకు ధైర్యం.. కష్టకాలంలోనూ నా వెంట నిలిచి అండగా నిలబడ్డారు.. మీ రుణం తీర్చుకోలేను అంటూ ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. మండలంలోని శిరిగిరిపాడులో బుధవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాచర్ల నియోజకవర్గంలో అరాచక, నియంతపాలన సాగుతున్నప్పుడు నాపై నమ్మకముంచి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పార్టీ ఇన్‌చార్జిగా తనను ప్రకటించారన్నారు. పరిపాలనా దక్షుడైన చంద్రబాబునాయుడు ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా ఉండడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గత వైసీపీ పాలనలో నియోజకవర్గంలో దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు, అన్యాయాలు పెట్రేగిపోయాయన్నారు. మండలంలో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ఏడు నూతన సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఐటీడీఏ ద్వారా నూతనంగా సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు.

వరికపూడిశెల సాధించకుంటే రాజకీయాల నుంచి తప్పుకుంటా

పల్నాడు ప్రజల చిరకాల వాంఛ అయిన వరికపూడిశెల ప్రాజెక్ట్‌ను సాధించకుంటే రాజకీయాల నుంచి తప్పుకుంటానని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిలా మాట తప్పే వ్యక్తిని కాదని అన్నారు. త్వరలోనే అన్ని అనుమతులతో వరికపూడిశెల పనులు ప్రారంభించి కృష్ణానీటిని రైతుల ముంగిటకు తీసుకొచ్చే బాధ్యత తనది అని బ్రహ్మానందరెడ్డి అన్నారు. అనంతరం మండలపరిధిలోని డ్వాక్రా మహిళలకు మంజూరైన రూ.3.20 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాల చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలకు ముగ్ధుడై చిన్నారులను ప్రత్యేకంగా అభినందించి నగదు బహుమతుని అందించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దుర్గా ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను, మంచినీటి పైపులైనును ప్రారంభించారు. నూతనంగా ఏర్పాటు చేయనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమాల్లో తెలుగుయువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కళ్లం రామాంజిరెడ్డి, మండల అధ్యక్షుడు పులుసు శివారెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు వజ్రంనాయక్, జనసేన మండల అధ్యక్షుడు గంధం మల్లయ్య, టీడీపీ నేతలు రాజబోయిన మధుసూదనయాదవ్, గుజ్జుల పాపిరెడ్డి, ముండ్లమూడి కోటయ్య, బీసీ కొండలు, స్పెషలాఫీసర్ జగదీశ్వరరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రసాద్, ఆశ్రమ పాఠశాల వార్డెన్ నాగేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దుర్గా తదితరులు పాల్గొన్నారు.

నూర్‌బాషా సంఘీయుల అభ్యున్నతికి కృషి

మాచర్లటౌన్, సెప్టెంబరు 25: నూర్‌బాషా సంఘీయుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో నూర్‌బాషా సంఘీయులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుతో కూడిన ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత యెనుముల కేశవరెడ్డి, బాదన్‌బాయి, కొమెర దుర్గారావు, సంబోజు వేణు, బండ్ల బ్రహ్మం, కొమెర శివ పాల్గొన్నారు.

మున్నా పొంగులుకు ఎమ్మెల్యే నివాళి

జమ్మలమడకకు చెందిన మున్నా పొంగులు దశదిన కర్మను బుధవారం గ్రామంలో నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గ్రామానికి చేరుకొని పొంగులు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు.

నాగమ్మకు నివాళులు

దుర్గి, సెప్టెంబరు 25: మండలంలోని ఆత్మకూరుకు చెందిన టీడీపీ నేత ముత్తినేని పుల్లయ్య తల్లి నాగమ్మ అనారోగ్య కారణాలతో బుధవారం మృతి చెందారు. గురువారం ఎమ్మెల్యే నాగమ్మ భౌతికకాయం వద్ద నివాళులర్పిచారు. కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

రోగులకు బాసటగా నిలిచేది సీఎం సహాయనిధే

రెంటచింతల, సెప్టెంబరు 25: అనారోగ్యంతో ఆసుపత్రి పాలైన రోగులకు స్వాంతన చేకూర్చడానికి, బాసటగా నిలవడానికి సీఎం సహాయ నిధి ఎంతగానో తోడ్పడుతుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మండలంలోని మంచికల్లుకు చెందిన మద్దిగపు వెంకటనరసమ్మకు సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.2.17 లక్షల చెక్కును బుధవారం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పంగులూరి అంజయ్య, గోగుల వెంకట్రామిరెడ్డి, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే స్కూల్ గేమ్స్

● జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రామాంజనేయులు



ఖోఖో పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

క్రోసూరు, సెప్టెంబరు 25: పాఠశాలల స్థాయిలో విద్యార్థుల క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకే స్కూల్ గేమ్స్ నిర్వహిస్తున్నట్లు క్రోసూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఏ రామాంజనేయులు అన్నారు. బుధవారం క్రోసూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో జరిగిన అండర్- 17, అండర్ - 14 బాలబాలికల నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. సుమారు వంద మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. వంద మీటర్ల అండర్ - 17 బాలుర పరుగు పందెంలో అమరావతి హైస్కూల్ విద్యార్థి టీ మోబిన్ ప్రథమ స్థానంలోను, బాలికల పరుగు పందెంలో పెదకూరపాడు హైస్కూల్ విద్యార్థిని జీ హన్సిక పెదమస్తాన్‌లు నిలిచినట్టు తెలిపారు. అండర్- 14 బాలుర లాంగ్ జంప్ విభాగంలో అచ్చంపేట హైస్కూల్ విద్యార్థి సీ కళారాజు ప్రథమ స్థానంలో, బాలికల విభాగంలో నాగవరం హైస్కూల్‌కు చెందిన పీ గంగోత్రి, ప్రథమ స్థానంలో నిలిచినట్టు తెలిపారు. అండర్- 17 బాలుర షాట్‌పుట్‌లో అచ్చంపేట హైస్కూల్ విద్యార్థి కే అద్దెయ్య ప్రథమ స్థానం, అండర్- 17 డిస్కస్ త్రో బాలికల విభాగంలో అచ్చంపేట కేజీబీవీ పాఠశాల విద్యార్థిని ఎం కీర్తన బాయి ప్రథమ స్థానంలో నిలిచినట్టు తెలియజేశారు. ఇక్కడ జరిగిన క్రీడా పోటీల్లో గెలుపొందిన బాల బాలికలు 27వ తేదీన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని నియోజకవర్గ స్కూల్ గేమ్స్ కో-ఆర్డినేటర్ సీవీ నాగరాజు తెలియజేశారు. పోటీలను నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించా రు. అంతకముందు మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మన్ కాంద్రు కాశయ్య పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.

నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో శ్రీచైతన్య విద్యార్థులు ముందంజ

పెదకూరపాడు, సెప్టెంబరు 25 : నియోజకవర్గస్థాయిలో క్రోసూరులో జరిగిన క్రీడా పోటీల్లో పెదకూరపాడుకు చెందిన జీఆర్ సీఆర్‌కే శ్రీ చైతన్య హైస్కూల్‌కు చెందిన 15 మంది విద్యార్థులు పలు పోటీల్లో తమ సత్తాను చాటి విజేతలుగా నిలిచారని నిర్వాహకులు గుత్తా కవితా రాము బుధవారం తెలిపారు. అండర్ - 17 బాలికల విభాగంలో వంద మీటర్లు, నాలుగు వందల మీటర్ల పరుగు పందెంలో ఎస్ స్నేహ ప్రథమ స్థాయిలో నిలవగా అండర్ - 14 విభాగంలో తన్వి ప్రథమ స్థానంలో విజయం సాధించారు. అండర్ - 17 విభాగంలో ఎనిమిది వందల మీటర్ల పరుగు పందెంలో వీ ప్రదీప్, నాలుగు వందల మీటర్ల పరుగు పందెంలో వీ జశ్వంత్‌లు ప్రథమ స్థాయిలో నిలచారు. అండర్ - 14 బాలుర విభాగంలో 100 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెంలో ఎం శేషసాయి ద్వితీయ స్థానం సాధించగా అండర్ 17 లాంగ్ జంప్ విభాగంలో ఎస్ స్నేహ ప్రథమ స్థాయిలో నిలిచారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను నిర్వాహకులు అభినందించారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

ముప్పాళ్ళ, సెప్టెంబరు 25 : మండలంలోని లంకెలకూరపాడులో పొలానికి నీరు పెట్టుకొనే విషయాల్లో జరిగిన గొడవ రెండు వర్గాల మధ్య ఘర్షణకు దారి తీసి ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం లంకెలకూరపాడులో పంట కాలువ ద్వారా నీటిని పొలానికి రానివ్వడం లేదనే ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు, పోలీసులు గ్రామానికి వెళ్లారు. పరిశీలిస్తుండగా స్వల్ప వివాదం జరిగింది. అది కాస్త టీడీపీ, వైసీపీ గొడవగా మారింది. వివాదం సద్దుమణిగి ఇంటికి వచ్చిన తరువాత వైసీపీకి చెందిన శివారెడ్డి, సాంబిరెడ్డిలు టీడీపీ వారిపై దాడి చేశారు. ఈ సంఘటనలో కిష్టిపాటి రామలింగారెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. టీడీపీ వారు కూడా ప్రతిఘటించటంతో వైసీపీలో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. రూరల్ సీఐ రాంబాబు సిబ్బందితో గ్రామానికి వెళ్లారు. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు కేసును పరిశీలిస్తున్నామని, గ్రామంలో పికెట్ నిర్వహిస్తున్నామని ఎస్ఐ సోమేశ్వరరావు తెలిపారు.

28న నియోజకవర్గ స్థాయి జాబ్ మేళా

క్రోసూరు, సెప్టెంబరు 25: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన క్రోసూరులోని పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కే సంజీవరావు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమో, ఫార్మసీ, పీజీ విభాగాలకు చెందిన 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ యువతీ యువకులు హాజరు కావచ్చన్నారు. పూర్తి బయోడేటా, విద్యార్హత ధ్రువీకరణ పత్రాల నకళ్ళతో, పాసు పోర్టు ఫొటోతో ఈనెల 28న ఉదయం 9నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చన్నారు. వివరాలకు 9494986164, 8074393466 నెంబర్లలో సంప్రదించాలని తెలియజేశారు.

కారంపూడి ఇన్‌చార్జి సర్పంచ్‌గా సరస్వతిబాయి

కారంపూడి, సెప్టెంబరు 25: కారంపూడి ఇన్‌చార్జి సర్పంచ్‌గా బాణావత్ సరస్వతిబాయి ఎన్నికయ్యారు. ఇప్పటివరకు సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వర్తించిన రమావత్ ప్రమీలాబాయి వ్యక్తిగత కారణాలతో సెలవు పెట్టారు. బుధవారం ఎంపీపీ కార్యాలయంలో తన సెలవు పత్రాన్ని ఎంపీడీవో శ్రీనివాసరెడ్డికి అందించారు. ఉపసర్పంచ్‌గా ఉన్న నూరె అంకారావు అనారోగ్య కారణాలతో రాజీనామా చేయడంతో 15వ వార్డు సభ్యురాలిగా ఉన్న సరస్వతిబాయి ఇన్‌చార్జి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు.

మండల అభివృద్ధికి సహకరించాలి : ఎంపీపీ

పెదకూరపాడు, సెప్టెంబరు 25: మండల అభివృద్ధికి అన్ని శాఖల అధికారు లు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని ఎంపీపీ బీ మీరయ్య అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశపు హాల్లో బుధవారం మండల సర్వసభ్య సమా వేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు షేక్ చాంద్ బాషా, ఎంపీడీవో పోతుల రామకృష్ణ, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాలి

పెదకూరపాడు, సెప్టెంబరు 25: రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ మీసాల దానియేలుకు బుధవారం వినతిపత్రం అందించారు. రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేయాలని ఆ వినతిపత్రంలో కోరారు.

ఓపెన్ స్కూల్ విద్యను ఉయోగించుకోవాలి

సత్తెనపల్లి, సెప్టెంబరు 25 : ఓపెన్ స్కూల్ విద్యను అందరూ ఉపయోగించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఎస్ అక్బర్ అలీ తెలిపారు. ఓపెన్ అడ్మిషన్‌ల పెంపుదల ప్రక్రియలో భాగంగా మంగళవారం మండలంలోని నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఓపెన్ స్కూల్ సెంటర్‌ను సందర్శించి ఎంఈవో శ్రీనివాసరావుతో కలసి పోస్టర్లను ఆవిష్కరించారు. అడ్మిషన్ల ప్రక్రియపై పలు సూచనలను చేశారు. అడ్మిషన్‌ల ప్రక్రియను వేగవంతం చేయటంలో సహకరించాలని ఎంఈవో శ్రీనివాసరావును కోరారు.

నేడు పరిరక్షణా ర్యాలీ

సత్తెనపల్లి, సెప్టెంబరు 25: సనాతన హిందూధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10గంటలకు తిరుమల పరిరక్షణ ర్యాలీ నిర్వహించనున్నట్టు సమితి సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ర్యాలీ ప్రారంభిస్తారని తెలిపారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం నుంచి కూరగాయల మార్కెట్ వద్ద గల వేంకటేశ్వర స్వామి దేవాలయం వరకు ర్యాలీ జరుగుతుందని సభ్యులు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రజలంతా ర్యాలీలో పాల్గొని జయప్రదం చేయాలని సభ్యులు కోరారు.

జూదరుల అరెస్టు

సత్తెనపల్లి, సెప్టెంబరు 25: పట్టణంలోని 31వ వార్డులో పొలాల్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకొని వారి నుంచి 2200 నగదు స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ ఎస్ఐ సంధ్యారాణి మంగళవారం తెలిపారు. ఆరుగురిపై కేసు నమోదు చేశామన్నారు. పట్టణంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

ఇసుక అందుబాటులో లేదు

సత్తెనపల్లి, సెప్టెంబరు 25: ఇసుక అందుబాటులో లేక, పనులు దొరక్క భవన నిర్మాణ కార్మికులు పడిగాపులు కాయాల్సి వస్తుందని భవన నిర్మాణ కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు అవ్వారు ప్రసాదరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇసుక ఆన్‌లైన్‌లో పల్నాడు జిల్లాను చూపటం లేదన్నారు బ్లాక్‌లో ట్రక్కు ఇసుకను ఐదు నుంచి రూ.8వేలకు కొనుగోలు చేయాల్సి వస్తుందన్నారు. పల్నాడు జిల్లాలోని ఇసుక డంపింగ్ యార్డులన్నింటినీ ఇసుకతో నింపి ఇసుక సరఫరాను అందుబాటులో ఉంచాలని ఆయన కోరారు.

28, 29 తేదీల్లో అర్బన్ మార్కెటింగ్

దాచేపల్లి, సెప్టెంబరు 25 : మెప్మా, దాచేపల్లి నగర పంచాయతీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 28, 29 తేదీల్లో అర్బన్ మార్కెటింగ్ నిర్వహిస్తున్నట్లు దాచేపల్లి నగర పంచాయతీ కమిషనర్ అప్పారావు బుధవారం తెలిపారు. అర్బన్ మార్కెట్‌లో స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేస్తున్న ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు జరుగుతాయన్నారు. ప్రజాప్రతినిధులు, స్థానికులు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా కోరారు.

మాచర్ల సర్వేయర్‌గా రఘుపతి

మాచర్లటౌన్, సెప్టెంబరు 25: మాచర్ల సర్వేయర్‌గా యడ్ల రఘుపతి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన దుర్గి సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై మాచర్లకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన సాల్మన్‌రాజు బదిలీపై నరసరావుపేట వెళ్లారు.

నియంత పాలనను కూల్చివేసిన కూటమి ప్రభుత్వం

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

ముప్పాళ్ళ, సెప్టెంబరు 25: రాష్ట్రంలో నియంత పాలనను కూల్చివేసి ఉత్తమ నాయకుడిని కూటమి ప్రభుత్వం ఎన్నుకుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలలోని లంకెల కూరపాడులో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా బుధవారం గ్రామంలో ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ రాష్ట్రానికి అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రి వచ్చాడని, గత ప్రభుత్వం చేసిన అరాచకాలను, అప్పులను సరిదిద్దుకుంటూ అమరావతిని, అభివృద్ధిని సమతూకంలో చూసుకుంటూ ముందుకు వెళ్తున్నారన్నారు. చెప్పిన విధంగానే పింఛన్‌ను రూ.4 వేలకు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సభలో వ్యవసాయశాఖ వారి పొలం పిలుస్తోంది గోడ పత్రికలను ఆవిష్కరించి మట్టి నమూనా పత్రాలను రైతులకు అందజేశారు. ముందుగా గ్రామంలోని ఎన్టీఆర్, డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మొక్కలను నాటారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, గోగినేని కోటేశ్వరరావు, దరువూరి నాగేశ్వరరావు, శిరిగిరి గోపాలరావు, రావిపాటి మధుబాబు, సర్పంచులు మల్లవరపు చంద్రశేఖర్, పోలూరి యలమంద, క్లస్టర్ ఇన్‌చార్జ్ అత్తోట వెంకటకృష్ణ, ఎంపీటీసీ కల్లం విజయ భాస్కర్‌రెడ్డి, మండల అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పల్నాడు ప్రజలు బాగుండాలని దేవుడిని కోరుకున్నా

● ఎమ్మెల్యే యరపతినేని



తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న యరపతినేని శ్రీనివాసరావు, కుటుంబసభ్యులు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 25: గురజాల నియోజకవర్గ ప్రజల శ్రేయస్సు, రైతన్నలు, వ్యాపార, కార్మికవర్గాలతో పాటు ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండేలా చూడాలని దేవుడిని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. యరపతినేని, ఆయన కుమారులు తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకొని పాడి పంటలతో రైతులు సుభిక్షంగా ఉండేలా చూడాలని దేవుడిని కోరుకున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యేతో పాటు రమేష్, మహేష్, నిఖిల్ తదితరులు స్వామివారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాచర్లటౌన్, సెప్టెంబరు 25 : నాగార్జున సాగర్ డ్యామ్ ఫీడర్ పరిధిలో ఇంటర్ లింకింగ్ లైన్స్‌కు సంబంధించిన పనులు జరుగుతున్నందున సాగర్ రోడ్డు, ఎంఎస్ఆర్‌టౌన్‌షిప్ పరిధిలో గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ రామయ్య తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రీస్కూల్‌తో చిన్నారుల్లో శారీరక, మానసికాభివృద్ధి

● మండల ప్రత్యేక అధికారి శ్రీకృష్ణదేవరాయలు

మాచవరం, సెప్టెంబరు 25 : ప్రీస్కూల్ ఏర్పాటు చేయటం వల్ల అందులో ఉన్న వివిధ రకాల ఆట వస్తువుల వల్ల పిల్లల్లో శారీరక, మానసికాభివృద్ధి చెందుతుందని మండల ప్రత్యేక అధికారి శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. బుధవారం మండలంలోని మల్లవోలు గ్రామంలో ప్రీస్కూల్‌ను ప్రారంభించి అందులో ఉన్న వివిధ రకాల ఆట వస్తువులను పరిశీలించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఈ ఆట వస్తువులను పిల్లలకు ఉపయోగపడే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంఈవో శ్రీధర్, ఏవో ప్రసాదు, ఐసీడీఎస్ సీడీపీవో రుక్షాన, టీడీపీ నాయకులు జక్కా వాసు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కోటేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుదలపై దృష్టి సారించాలి: ఎంపీడీవో

మాచవరం, సెప్టెంబరు 25: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలపై దృష్టిసారించి అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసరావు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ రకాల అంశాలపై పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీమీ గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. మీ పరిధిలో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కార మార్గాలు చూపాలన్నారు. గ్రామాల్లో వైద్య సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టాలన్నారు. అదేవిధంగా పంచాయతీకి సంబంధించిన రికార్డులను సమర్థవంతంగా నిర్వహించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీకృష్ణదేవరాయలు, ఈవోఆర్‌డీ వెంగళరావు, ఏవో ప్రసాదు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అందరికీ ఆదర్శం వెంకటకోటయ్య మాష్టారు

కారంపూడి, సెప్టెంబరు 25: అందరికీ ఆదర్శం ఎం వెంకటకోటయ్య మాష్టారు అని పలువురు వక్తలు కొనియాడారు. మండలంలోని పెదకొదమగుండ్ల ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయుడైన వెంకటకోటయ్య ఉపాధ్యాయ దినోత్సవంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని ఆంజనేయ ఫంక్షన్ హాల్లో మండల ఉపాధ్యాయులు వెంకటకోటయ్య దంపతులను దుశ్శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు కాంతారావు, రవికుమార్, అల్లి సురేష్, పినాకాపాణి, ఎన్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, టీడీపీ మండల నేతలు పాల్గొన్నారు.

ఘనంగా పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి

మాచర్లటౌన్, సెప్టెంబరు 25 : పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ నేతలు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చూపిన మార్గంలోనే ప్రధాని నరేంద్రమోదీ పయనిస్తూ సుపరిపాలన అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఓర్సు క్రాంతికుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు కూనిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వెంకటరమణమ్మకు నివాళులర్పించిన అక్కిరెడ్డి

మాచర్లటౌన్, సెప్టెంబరు 25: మాచర్లకి చెందిన వెంకటరమణమ్మ బుధవారం అనారోగ్య కారణాలతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న టీడీపీ యువనేత జూలకంటి అక్కిరెడ్డి ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించాడు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ నేతలున్నారు.

అధికారుల సమావేశం

మాచర్లటౌన్, సెప్టెంబరు 25 : పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం స్పెషలాఫీసర్ గబ్రునాయక్ అధ్యక్షతన అధికారుల సమీక్ష నిర్వహించారు. ఈనెల 28వ తేదీన మండలపరిధిలో నిర్వహించనున్న స్వచ్ఛతాహీ సేవా, ఇది మంచి ప్రభుత్వం, స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సరోజినిదేవి, ఈవోపీఆర్డీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు నివాళి

పిడుగురాళ్ల, సెప్టెంబరు 25: సినీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నాలుగో వర్ధంతి సందర్భంగా పిడుగురాళ్లలోని రాగసుధ కళాపరిషత్ ఆధ్వర్యంలో బుధవారం జానపాడు రోడ్డులోని ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. సినిమా పాటల ద్వారా కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న వ్యక్తి ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అని సంస్థ సభ్యులు అన్నారు. ఈ కార్య క్రమంలో తూనుగుంట్ల శ్రీనివాసరావు, కోలా పుల్లయ్య, వడ్లమూడి వెంకటేశ్వర్లు, ఆత్మకూరి లక్ష్మీనరసింహమూర్తి, గుండా శ్రీనివాసరావు, మునేశ్వరరావు, ముప్పాళ్ల సాంబశివరావు, బండ్ల లక్ష్మణరావు, రోశయ్య, ఆర్టీసీ వెంకటరావు, కళాపరిషత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



వెల్లటూరులో దివ్యాంగులకు ఉపకరణాలను పంపిణీ చేస్తున్న శివశక్తి ఫౌండేషన్ నిర్వాహకురాలు లీలావతి

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

బొల్లాపల్లి, సెప్టెంబరు 25: మండలంలోని వెల్లటూరులో కమిట్‌మెంట్ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆర్వర్యంలో బుధవారం దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జీవీ సతీమణి, శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ నిర్వాహకురాలు లీలావతి హాజరయ్యారు. బొల్లాపల్లి మండలం, వినుకొండలాల్లో 110 మందికి రూ.10 లక్షలు విలువైన పరికరాలను లీలావతి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లీలావతి మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థ వారు దివ్యాంగులకు ఉపకరణాలను కమిట్‌మెంట్ చారిటబుల్ ట్రస్ట్ వారు అందించటం హర్షించదగ్గ విషయం అన్నారు. కార్యక్రమంలో పెమ్మసాని నాగేశ్వరరావు, పెంటాల వెంకటేశ్వర్లు, అర్ధలపూడి శ్రీనివాసరావు, పరిటాల రామచంద్రయ్య, ఝాన్సీ, బొట్లగుంట నాగేశ్వరరావు, కమిట్‌మెంట్ చారిటబుల్ ట్రస్ట్ సిబ్బంది అభిమన్యు కుమార్, సందీప్, దాతయ్య, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.



ఏపీ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం మాజీ సెక్రటరీ పెరుగుపల్లి వెంకట్రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జీవీ, మాజీ ఎమ్మెల్యే మక్కెన, సంఘం పెద్దలు తదితరులు

పెరుగుపల్లి వెంకట్రావుకు ఘన నివాళి

వినుకొండ, సెప్టెంబరు 25: నాయీ బ్రాహణ సేవా సంఘం మాజీ అధ్యక్షుడు పెరుగుపల్లి వెంకట్రావు సంతాప సభను రైల్ పేటలోని ఆయన నివాసం వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పెరుగుపల్లి వెంకట్రావు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయీబ్రహ్మణ సేవా సంఘం మాజీ సెక్రటరీగా, వినుకొండ నియోజకవర్గం నాయీ బ్రహ్మణ సేవా సంఘం అధ్యక్షుడిగా చేసిన సేవలు మరువరానివని కొనియాడారు. అదేవిధంగా తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి పాటుపడ్డారని, ఆయన లేనిలోటు తీర్చలేనిదని చెప్పారు. కార్యక్రమంలో జయచంద్ర ఫిల్లింగ్ స్టేషన్ అధినేత ద్రోణాదుల వెంకటఅప్పారావు, కుమారులు పెరుగుపల్లి శివప్రసాద్, శివశంకర్, ఎస్‌బీఐ పి.వెంకట్రావు, గుంటుపల్లి కోటేశ్వరరావు, టి.లక్ష్మీనరసయ్య, టీడీపీ నాయకులు గోల్డు కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

రొంపిచర్ల, సెప్టెంబరు 25: మండల కేంద్రమైన రొంపిచర్ల జడ్పీ పాఠశాలలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు బుధవారం నిర్వహించారు. నేత్ర వైద్య సహాయకుడు కే.మురళీకృష్ణ, వైద్య సిబ్బంది విద్యార్థులకు నిర్వహించిన పరీక్షల్లో పాల్గొన్నారు. 25 మందికి దృష్టి లోపాలు ఉన్నట్లు గుర్తించారు. త్వరలో వీరికి కళ్ళజోళ్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కిరణ్ పాల్గొన్నారు.



రొంపిచర్లలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

దివ్యాంగుల పాఠశాలలో అన్నదానం

కారుమంచి (శావల్యాపురం) సెప్టెంబరు 25: దివ్యాంగుల సంక్షేమానికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని హెచ్‌ఎం పేటేటి సుధాకర్ అన్నారు. మండలంలోని కారుమంచిలోని సరోజినీదేవి చెవిటి, మూగ మానసిక వికలాంగుల పాఠశాల్లోని దివ్యాంగులకు గ్రామానికి చెందిన పరిటాల ఆంజనేయులు, సులోచన దంపతుల కుమారుడు రాజీవ్ పుట్టినరోజును పురస్కరించుకొని బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం దివ్యాంగులకు క్రీడాపోటీలను నిర్వహించిన బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది అంకమ్మరావు, రాజ్యలక్ష్మి, అనూష, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి సంబరాలు ప్రారంభం

శావల్యాపురం, సెప్టెంబరు 25: జన విజ్ఞానవేదిక మండల కమిటీ వారి ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలు 2024ను బుధవారం ఘనంగా ప్రారంభించారు. మండలంలోని వేల్పూరు, పోట్లూరు, శావల్యాపురం, మతుకుమల్లి, కారుమంచి గ్రామాలలోని జడ్పీ పాఠశాల్లో 8,9,10 తరగతుల విద్యార్థులకు ప్రతిభ పరీక్షలు నిర్వహించగా 400మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. శావల్యాపురం జడ్పీ పాఠశాలలో జరుగుతున్న ప్రతిభ పరీక్షలను ఎంఈవో-2 లలితాకుమారి, హెచ్‌ఎం విజయలక్ష్మి, స్టాఫ్ సెక్రటరీ బీవీ నాగేశ్వరరావు పర్యవేక్షించారు. ఎంఈవో-2 మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో 8,9,10 తరగతుల్లో ప్రతిభచూపిన విద్యార్థులను గుర్తించి ఒక టీంగా తయారుచేసి అక్టోబరు 1న మండలస్థాయిలో జరగనున్న చెకుముకి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ, పాటవాలను వెలికితీసేందుకు చెకుముకి పోటీలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో మండల జన విజ్ఞాన వేదిక సభ్యులు బోయపాటి తివిక్రమ్, వసంతరావు, ఉపాధ్యాయులు శ్రీనివాసరాజు, భువనేశ్వరి, హబీ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి: ఎంఈవో-2 లలితాకుమారి

శావల్యాపురం, సెప్టెంబరు 25: స్టెప్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం నెక్కల్లులోని రమణారావు, సావిత్రమ్మ ధ్యాన ఆరోగ్య ఆశ్రమంలో అక్టోబరు 4,5,6 తేదీల్లో నిర్వహించనున్న రెసిడెన్షియల్ ట్రైనింగ్‌కు ఉపాధ్యాయులంతా పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో-2 పునులూరి లలితాకుమారి అన్నారు. ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులకు మనోవిజ్ఞాన శాస్త్రం, వ్యక్తిత్వవికాసం అంశాలపై సైకాలజిస్టులతో ప్రాథమిక పరిజ్ఞానాన్ని కలిగించి విద్యార్థుల సమస్యలు పాఠశాల స్థాయిలోనే పరిష్కరించాలన్న లక్ష్యంతో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు దసరా సెలవుల్లో కుటుంబసమేతంగా శిక్షణ తరగతులకు హాజరుకావచ్చని, వారికి ఉచితంగా భోజన వసతి కల్పించడంతో పాటు పాల్గొన్న వారికి సర్టిఫికెట్‌ను ఇవ్వడం జరుగుతుందన్నారు. వివరాలకు 9030644440, 8143234555 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఘనంగా ఎస్‌ఎస్‌ఎన్ కళాశాలలో ఫ్రెషర్స్ డే



విద్యార్థిని సత్కరిస్తున్న కళాశాల అధ్యక్షుడు విజయకుమార్, సుబ్బరాయగుప్త తదితరులు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 25: స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాలలో 2024-2025 బ్యాచ్ సీనియర్ ఇంటర్ విద్యార్థులు నూతనంగా చేరిన జూనియర్ ఇంటర్ విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ డే బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల పాలవర్గ అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్తా, కళాశాల ఉపాధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విజిలెన్స్ అవగాహన సదస్సు

బొల్లాపల్లి, సెప్టెంబరు 25: మండలంలోని వెల్లటూరులో చైతన్య గ్రామీణ గోదావరి బ్యాంక్ ఆధ్వర్యంలో బుధవారం విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్‌ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ ఆగస్టు 16నుంచి నవంబరు 15 వరకు విజిలెన్స్ వారోత్సవాలు జరుగుతాయని, బ్యాంకుల్లో ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువెళితే తక్షణమే పరిష్కారమవుతుందన్నారు. బ్యాంక్ అధికారుల అవినీతిపై ఫిర్యాదు చేసిన వ్యక్తి వివరాలను గోప్యంగా ఉంచటంతో పాటు విచారణ చేస్తామన్నారు. రైతులకు రుణాలు, బ్యాంక్ సేవలను పరిసర గ్రామాల రైతులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ కజ్జాయం లక్ష్మీనారాయణ, ఎ.లింగరాజు, విజిలెన్స్ అధికారులు రాంబాబు, విజయ్, బ్రాంచ్ మేనేజర్ సుశాంత్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.







పెరుమాళ్ళపల్లి ఎత్తిపోతల పథకం, పనిచేయని ట్రాన్సుఫార్మర్లు, మరమ్మతులకు గురైన మోటార్లు

నిరుపయోగంగా ఎత్తిపోతల పథకం

- మరమ్మతులతో 3వేల ఎకరాలకు సాగునీరు
- ఆరు గ్రామాల రైతులకు, కూలీలకు ఉపయోగం
- మరమ్మతులు చేపట్టాలని రైతుల డిమాండ్

వినుకొండ టౌన్, సెప్టెంబరు 25: వలసలు నిర్మూలించేందుకు నందమూరి తారకరామారావు ప్రభుత్వ హయాంలో మండలంలోని చాట్రగడ్డపాడు సమీపంలో గుండ్లకమ్మ నదిపై ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. అయితే గతంలో గండ్లకమ్మలో నీరు సక్రమంగా లేకపోవటంతో పాటు గత పాలకులు ఈ పథకాన్ని నిర్వహించకుండా, ఉదాశీనంగా వ్యవహరించారు. తరచూ ట్రాన్స్‌ఫార్మర్లు పాడయిపోవటంతో వీటిని నిర్వహించేవారు లేక ఈ పథకం నిర్వీర్యం అయింది. కోట్ల రూపాయల నిధులతో నిర్మించిన పథకాలు పనిచేయకపోవడంతో సాగు నీటికోసం రైతులు అల్లాడిపోతున్నారు. చాట్రగడ్డపాడు, ఉప్పలపాడు, వితంరాజుపల్లి, కోటప్పనగర్, జంగాలపల్లి, హసన్నాయుడుపాలెం తదితర చుట్టుపక్కల రైతులు వర్షాధార పంటలపై ఆధారపడి పంటలు పండించాల్సిన పరిస్థితి. పెరుమాలపల్లి మేజర్ ఎతిపోతల పథకం పనిచేయక పంటపొలాలు బీడువారిపోతున్నాయి. రైతులు పొలాలు వదిలి, పట్టణాల్లో పనులు వెతుకోవాల్సి వస్తోంది.

వాచ్‌మెన్‌ను కట్టేసి ట్రాన్సుఫార్మర్లలో వైరు చోరీ

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏళ్ళనాటి ఎత్తిపోతల పథకాన్ని కాపాడుకోవడానికి కొందరు రైతులు ముందుకువచ్చారు. లక్షలాది రూపాయలు ఖర్చుచేసి చెట్లను తొలగించి, విద్యుత్‌కు అంతరాయాలు లేకుండా ఏర్పాట్లుచేసుకుని, ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేయించారు. అయితే నెల రోజుల క్రితం వాచ్‌మెన్‌ను తాళ్ళతో మంచానికి కట్టేసి, ట్రాన్సుఫార్మర్లలో ఉన్న రాగితో పాటు, దానిలోని ఆయిల్‌ను దొంగలు దోచుకుపోయారు. దీంతో ఈ పథకం పూర్తిగా నిర్వీర్యమైంది.

రైతుల సొంత నిధులతో ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు

అయితే నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల పథకానికి చాట్రగడ్డపాడు గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు ముందుకు వచ్చి, ఎత్తిపోతల పథకంలోని ఒక ట్రాన్సుఫార్మర్, ఒక మోటారును సొంత నిధులతో మరమ్మతులు చేయించి కేవలం చాట్రగడ్డపాడు రైతులకు పత్తి, పొగాకు, మిర్చి పంటలకు ఆరుతడి పంటలకు సాగునీరు అందించేందుకు రైతులతో ఒప్పందం కుదుర్చుకుని సాగునీరు అందిస్తున్నారు. దీంతో ఈ ప్రాంతంలోని రైతులు వర్షంపై ఆధారపడకుండా, ఎత్తిపోతల పథకం సాగునీటిపై ఆధారపడి పొగాకు, మిర్చినారు విత్తుతున్నారు. నాలుగు ట్రాన్సుఫార్మర్లకుగాను నేడు ఒకే ఒక ట్రాన్సుఫార్మర్‌పై ఆధారపడి రైతులు కేవలం 100 ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. అధికారులు స్పందించి, మరమ్మతులకు గురైన మోటార్లు, విద్యుత్ ట్రాన్సుఫార్మర్లు ఏర్పాటుచేస్తే ఆరు గ్రామాలకు నీరు అందించవచ్చని పలువురు రైతులు కోరుతున్నారు. ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా ఉండడంతో, రైతులకు కాలం కలిసి వస్తుందని పంటలు సాగుకు ఎక్కువమంది ఆసక్తి చూపుతున్నారు.



రైతులు సొంత నిధులు వెచ్చించి ఒక మోటారు నుంచి చాట్రగడ్డపాడు పంట పొలాలకు మళ్లించిన గుండ్లకమ్మ నీరు

పూర్తిస్థాయి మరమ్మతులతో మూడువేల ఎకరాలకు సాగునీరు

పెరుమాళ్లపల్లి ఎత్తిపోతల పథకంలో మరమ్మతులకు గురైన మోటార్లు రిపేరుతోపాటు, పూర్వం నిర్మించిన పైపులైన్ పునఃనిర్మించి అదనపు ట్రాన్సుఫార్మర్లు ఏర్పాటుచేస్తే ఆరు ఊర్లకు సుమారు 3వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చని ఆప్రాంత రైతులు చెబుతున్నారు. ప్రజా ప్రతినిదులు ఈ విషయంపై దృష్టి సారించి ఈ పథకాన్ని మరలా వినియోగంలోకి తేవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

రైతులకు కొండంత అండగా ప్రభుత్వం: ఎమ్మెల్యే జీవీ

వినుకొండ, సెప్టెంబరు 25: రాష్ట్రంలో 100 రోజుల పాలనలోనే రైతులకు కూటమి ప్రభుత్వం కొండత అండగా నిలిచిందని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని ఉమ్మడివరంలో బుధ వారం అధికారులతో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఆంజనేయులు మాట్లాడుతూ రైతులకు వ్యవసాయం ఒక పండుగలా ఉండాలని, లాభదాయకంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు కృషి చేస్తున్నారని, అందుకోసమే రాష్ట్ర వ్యాప్తంగా రైతులతో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టడం జరిగిగిందన్నారు. మంగళ, బుధవారాల్లో అధికారులు గ్రామాల్లో పర్యటిస్తారన్నారు. 90శాతం సబ్సిడీ పనిముట్లు అందచేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రైతులకు గత ప్రభుత్వంలో పెండింగ్ బకాయిలు 1670కోట్లు చెల్లించామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మండల పార్టీ అధ్యక్షుడు మాదినేని అంజనేయుల, మక్కెన కొండలు, రత్తయ్య, గ్రామ సర్పంచి వీరగంధం ఆనంద్, ఎర్రంరెడ్డి అంజిరెడ్డి, ముత్తినేని ఏడుకొండలు, వెంకటేశ్వరెడ్డి, అశోక్, జనసేన పార్టీ నాయకులు నాగశ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఉమ్మడివరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

● నాదెండ్ల: మండలంలోని తూబాడు, చిరుమామిళ్ళ గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ వీ మస్తానమ్మ, జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం శివ కుమారిలు భూసార పరీక్షలు, విత్తన శుద్ధి, వేప గింజల కషాయం తయారీ పద్దతులపై వివరించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి నవీన్, వ్యవసాయ అధికారి ఏ హరి ప్రసాదు, మార్కెట్ యార్డు సూపర్ వైజర్ నరసింహారెడ్డి, ఉద్యాన సహాయకులు పీ కృష్ణ సౌజన్య, వీ సుబ్బారావు, రైతులు పాల్గొన్నారు.

● యడ్లపాడు: మండలంలోని కొండవీడు, చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామాలలో వ్యవసాయ శాఖాధికారులు పొలంబడి కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. కొండవీడులో ఏవో సరిత క్షేత్రస్థాయిలో పత్తి పంటను పరిశీలించారు. చెంఘీజ్‌ఖాన్‌పేటలో గ్రామసభను నిర్వహించారు. జిల్లా సెరికల్చర్ అధికారి సుబ్రమణ్యం పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం పట్టు పురుగుల పెంపకం కేంద్రాన్ని సందర్శించి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు.



మాచవరంలో పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు

● ఈపూరు: యాజమాన్య పద్ధతులను పాటించడం వలన అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి ఆర్ రామారావు అన్నారు. మండలంలోని చిట్టాపురం, గోపువారిపాలెం గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

● చిలకలూరిపేట: మండలంలోని మురికిపూడి, రామచంద్రాపురం గ్రామాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం శివకుమారి, నరసరావుపేట ఏడీఏ పి మస్తానమ్మ, చిలకలూరిపేట మండల వ్యవసాయ అధికారిణి శ్రీలత, వెటర్నరీ డాక్టర్ దీప్తి, చిలకలూరిపేట మార్కెట్ యార్డ్ సూపర్ వైజర్ బాబురావు, గ్రామ వ్యవసాయ సహాయకులు జె నాగరాజు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని పండుగలా చేసుకోవాలి: డాక్టర్ అరవిందబాబు

రొంపిచర్ల: రైతులు అవకాశాలను అందిపుచ్చుకొని వ్యవసాయాన్ని పండుగలా చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. మండలంలోని మాచవరం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో యాంపాటి కోటిరెడ్డి, పోతిరెడ్డి అంజిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఏవో శివలీల, పశు వైద్యులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు నీటి కుళాయిలు ఏర్పాటుచేస్తాం

● ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, సెప్టెంబరు 25: పట్టణంలోని నిరుపేదలకు శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ద్వారా నూతన కుళాయికి రూ.200 చెల్లించి కుళాయిలు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు హామీ ఇచ్చారు. పట్టణంలోని 16, 17 వార్డుల్లో పురపాలక సంఘం ఆధ్వర్యంలో తిమ్మాయిపాలెం రోడ్డులోని వైకన్వెన్షన్ హాల్‌లో మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోష్ అధ్యక్షత ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తూ, అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతూ ప్రజలను ఆదుకుంటున్న కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వం అని ప్రజలతో పిలిపించుకుంటున్నదన్నారు. త్వరలో 159కోట్ల రూపాయలతో వినుకొండలో తాగునీటి పథకం పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మున్సిపల్ చైర్మన్ దస్తగిరి, షమీమ్, పత్తిపూర్ణ, సౌదాగర్ జీనీ, నాగశ్రీను, ఆయుబ్ ఖాన్, పీవీ సురేష్, గట్టుపల్లి శ్రీను, బత్తుల బలరాజు, కలింగరాజు, చికెన్ బాబు, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

వృద్ధులకు బీసీజీ వ్యాక్సిన్లు: డాక్టర్ మాలకొండయ్య

నూజెండ్ల, సెప్టెంబరు 25: మండలంలోని 60 సంవత్సరాలు దాటిన వృద్ధులకు టీబీ వ్యాధి బారిన పడకుండా ఉండేలా బీసీజీ వ్యాక్సిన్‌ను వేస్తున్నట్లు మండల వైద్యాధికారి జీ మాలకొండయ్య బుధవారం తెలిపారు. మండలంలోని వీ అప్పాపురం వెల్‌నెట్ సెంటర్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాలకొండయ్య మాట్లాడుతూ బరువు తక్కువగా ఉన్నవారు, ఎత్తుకు తగ్గ బరువులు లేకుండా తక్కువ ఉన్న వారిని, 60సంవత్సరాల పైబడిన వారికి ఇప్పటి వరకు 2560 మందికి వ్యాక్సిన్ వేశామన్నారు. టీబీ వ్యాధి నివారణ వ్యాక్సిన్ కోసం సోమ, గురువారాల్లో స్థానిక వైద్యశాల, సచివాలయాల్లో వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. మండలంలోని గ్రామ సచివాలయాల్లో ఏఎన్ఎంలుగా పనిచేస్తూ రెండు సంవత్సరాల క్రితం గుంటూరు, నరసరావుపేట జనరల్ హాస్పటల్‌కు వెళ్ళి వీఎన్ఎం స్టాఫ్ నర్సులుగా శిక్షణ పొంది వచ్చిన కే కుమారి, జీ నాగేంద్రం, జీ జయలక్ష్మి, జీ రమాదేవి, ఎస్ హేమలత, టీ కుసుమలతలను సచివాలయాల్లో విధుల్లోకి చేరారు. ఈ సందర్భంగా శిక్షణను దిగ్విజయంగా పూర్తి చేసుకున్నందుకు అభినందనలు తెలిపారు.

సూపర్ సిక్స్ హామీల అమలులో ప్రభుత్వం విఫలం: కాంగ్రెస్

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 25: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల హామీ అమలులో విఫలమైందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. బుధవారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట కలెక్టర్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తాలి బజావ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి విఫల పరిపాలన నుంచి ఆంధ్రప్రదేశ్ తప్పించుకొని టీడీపీ కూటమిని అధికారంలోకి తీసుకొస్తే, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా మొదలు పెట్టకుండా సున్నామార్కులతో విఫలమైందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీ అలెగ్జాండర్ సుధాకర్, మద్దు రాధాక్రిష్ణ, చెన్న శ్రీనివాస్, భాషా, పీసీసీ డెలిగేట్ సీదా కృష్ణ, యూత్ నాగేంద్ర, రవికిషోర్, బ్రహ్మయ్య, స్వర్ణ శ్రీను, అరాఫత్, ప్రేమ్, నాగార్జున, కొండలు, తదితరులు పాల్గొన్నారు.

రొంపిచర్ల హైవే వద్ద సూచికల ఏర్పాటు

రొంపిచర్ల, సెప్టెంబరు 25: మండలంలోని రొంపిచర్లలో అద్దంకి - నార్కెట్‌పల్లి రహదారి వద్ద సూచిక బోర్డులను బుధవారం ఏర్పాటు చేశారు. హైవే వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో వీటిని ఏర్పాటు చేసినట్లు రూరల్ సీఐ రామకృష్ణ తెలిపారు. వాహనదారులు క్రాస్ రోడ్డు వద్దకు రాగానే ఆగి నెమ్మదిగా వెళ్ళాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

27న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

రొంపిచర్ల, సెప్టెంబరు 25: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 27న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మాథ్యూబాబు బుధవారం తెలిపారు. మండలంలోని ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని పేర్కొన్నారు.

తిరుమల ఘటనపై సమగ్ర విచారణ చేయాలి

చిలకలూరిపేట, సెప్టెంబరు 25: తిరుమలలో జరిగిన సంఘటనలపై ప్రభుత్వం సమగ్రమైన విచారణ జరిపి దానికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని, ఆదిత్య బ్రాహ్మణ సేవా సమితి సభ్యులు బుధవారం డిమాండ్ చేశారు. పట్టణంలోని చౌత్రా సెంటర్ శివాలయంలో జరిగిన సమావేశంలో పలువురు సమితి నాయకులు మాట్లాడి తిరుమలలో లడ్డు తయారీలో వాడిన కల్తీ నెయ్యి సంఘటనను ఖండించారు.

వేధింపులపై భార్య ఫిర్యాదు

ఈపూరు, సెప్టెంబరు 25: వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని వేధిస్తున్న భర్తపై ఓ మహిళ ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని కొచ్చెర్ల గ్రామానికి చెందిన ఐ.వీరాంజనేయులు కుమార్తె అంజలికి నర్సరావుపేటకు చెందిన తిరుమలశెట్టి గోపీనాథ్‌తో ఆగస్టు 24, 2023న వివాహం జరిగింది. వివాహం అనంతరం 16 రోజులకు అంజలి కాపురానికి వచ్చింది. కొద్దిరోజులకు, వివాహం సమయంలో బంధువుగా పరిచయం చేసిన మహిళతో గోపీనాథ్ సహజీవనం చేస్తున్నట్లు తెలుసుకుని అంజలి ప్రశ్నించింది. దీంతో గోపీనాథ్ ఆమెపై దాడిచేసి పుట్టింటికి వెళ్ళమని బెదిరించాడు. దీంతో అంజలి పుట్టింటికి వచ్చింది. కొద్దిరోజుల తర్వాత పెద్ద మనుషుల సమక్షంలో రాజీ జరిగి, తిరిగి కాపురానికి వచ్చింది. పది రోజుల తర్వాత తిరిగి ఘర్షణ జరగ్గా, తనకు గతంలో రెండు పెళ్లిళ్లు జరిగాయని, తనను వదిలి వెళ్లాలని అంజలిని గోపీనాథ్ బెదిరిస్తూ, దూషించాడు. దీంతో అంజలి, తండ్రి వీరాంజనేయులుతో కలిసి ఈపూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంజలి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రాష్ట్రస్థాయి జూడోలో ఏఎంజీ విద్యార్థినికి రజతం

చిలకలూరిపేట, సెప్టెంబరు 25: ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ అండర్ 14 జూడో రాష్ట్ర స్థాయి పోటీలు 22 నుంచి 23 వరకు తిరుపతిలో జరిగాయి. ఈ పోటీలలో స్థానిక ఏఎంజీ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని అమూల్య పాల్గొని 45కేజీల విభాగంలో రజత పతకం సాధించింది. విద్యార్థినిని గుంటూరు జిల్లా డీఈవో శైలజ, పల్నాడు జిల్లా డీఈవో ఎం వెంకటేశ్వర్లు అభినందించారు. వీరితోపాటు ఏఎంజీ ఇండియా ఇంటర్ నేషనల్ డైరెక్టర్ డాక్టర్ అరుణ్ కుమార్ కంటి మహంతి, పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సురేష్, హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.కృపాదానం, వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, రాజేష్ అభినందించారు.



విద్యార్థిని అమూల్యను అభినందిస్తున్న గుంటూరు డీఈవో శైలజ



విద్యార్థినికి చెక్కును అందజేస్తున్న మేక సూరిబాబు, పాల్గొన్న పాలక వర్గ సభ్యులు

వైద్య విద్యార్థినికి ఆర్థికసాయం

గుంటూరు (తూర్పు), సెప్టెంబరు 25: కాకతీయ మెడికల్ కళాశాలలో ప్రవేశ పొందిన నూజెండ్ల మండలం, చింతలచెరువు గ్రామానికి చెందిన బత్తిన గాయత్రికి విశ్రాంత పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు మేకా సూరిబాబు, కమ్మజన సేవ సమితి పాలకవర్గ సభ్యులు అండగా నిలబడ్డారు. మేకా సూరిబాబు రూ.30వేలు, పాలకవర్గ సభ్యులు చుక్కపల్లి రమేష్, మర్రిపూడి సీతారామయ్య పెద్ది సాంబశివరావు, కట్టా శివాజీలు రూ.20వేలు మొత్తం 50వేలను విద్యార్థినికి చెక్కును అందజేశారు. అనంతరం చుక్కపల్లి రమేష్ మాట్లాడుతూ బత్తిన గాయత్రి నీట్‌లో 1319, స్టేట్‌లో 143 ర్యాంకులు సాధించిందని, కానీ పేదరికంతో చదువుకు ఆటంకం కలుగుతుందని, దీంతో ఈ సాయం చేస్తున్నామని అన్నారు. చదువు పూర్తయ్యేవరకు ఈ సాయం కొనసాగిస్తామని తెలిపారు.

యడ్లపాడు ఎంపీడీవోగా హేమలతాదేవి

యడ్లపాడు, సెప్టెంబరు 25: యడ్లపాడు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా వి.హేమలతాదేవి బాధ్యతలు స్వీకరించారు. చిలకలూరిపేట మండల ఎంపీడీవోగా ఇప్పటివరకు విధులు నిర్వహించిన ఆమె సాధారణ బదిలీల్లో భాగంగా యడ్లపాడుకు బదిలీ అయ్యారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన వై హనుమారెడ్డి బెల్లంకొండ మండలానికి బదిలీ అయ్యారు. నూతన ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన హేమలతాదేవిని ఈవోపీఆర్డీ వరూధినితోపాటు ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు, పలువురు రాజకీయ నాయకులు కలసి అభినందించారు.

గ్రహణం మొర్రి క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

● ఎంఈవోలు సాంబశివరావు, పార్వతి

శావల్యాపురం, బొల్లాపల్లి సెప్టెంబరు 25: ఈ నెల 27వ తేదీన జరగనున్న ఉచిత గ్రహణమొర్రి స్క్రీనింగ్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి మద్దిగుంట్ల సాంబశివరావు, బొల్లాపల్లి ఎంఈవో పార్వతి బుధవారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు. బసవతారకం స్మైల్ ట్రైన్ సెంటర్, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, సమగ్ర శిక్ష డాక్టర్ ముకుందరెడ్డి ఆధ్వర్యంలో నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయం వద్ద ఉన్న లింగంగుంట్ల శంకర భారతీపురం జడ్పీ పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రహణమొర్రి సమస్యతో బాధపడుతున్న 6నెలలు నుండి 50ఏళ్ళున్న బాధితులు, గతంలో గ్రహణమొర్రి ఆపరేషన్‌లు చేయించుకున్నవారు స్క్రీనింగ్ క్యాంప్‌కు హాజరై వైద్య పరీక్షలు చేయించుకోవచ్చన్నారు. ఆపరేషన్‌లు అవసరమైనవారికి ఉచితంగా ఆపరేషన్‌లు నిర్వహించడం జరుగుతుందన్నారు. 27వతేదీ ఉదయం 10గంటలకు స్క్రీనింగ్ క్యాంపుకు హాజరుకావాలన్నారు. భవిత పాఠశాల ఉపాధ్యాయులు జగన్మోహన్‌రెడ్డి, శివపార్వతి పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఏఎంరెడ్డి ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు

ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో స్వచ్ఛత హీ సేవ

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 25: స్థానిక ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జున, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆఫీసర్ డాక్టర్ కే కృష్ణారెడ్డి పాల్గొని ప్లాస్టిక్ వ్యర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ ఆట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న కళాశాల చైర్మన్ రామశేషగిరిరావు తదితరులు

ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో వరల్డ్ ఫార్మసీ డే వేడుకలు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 25: స్థానిక ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో వరల్డ్ ఫార్మసీ డే వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణం నుంచి కేసానుపల్లి వరకు ఫార్మసీ డే ర్యాలీని నిర్వహించారు. ముందుగా ర్యాలీని కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు జెండా ఊపి ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రి చీఫ్‌ఫార్మసీ ఆఫీసర్ చెరుకూరి మాల్యాద్రి, బీ సురేష్‌బాబు, దొప్పలపూడి అశ్వినలను విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం ప్రసాదరావు, డాక్టర్ బండ్ల రామచంద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై నరసింహారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆటల పోటీల్లో కొండ్రముట్ల విద్యార్థుల ప్రతిభ

కొండ్రముట (ఈపూరు) సెప్టెంబరు 25: నియోజకవర్గం ఆటల పోటీలలో మండలంలోని కొండ్రముట్ల హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు హెచ్‌ఎం లక్ష్మి బుధవారం తెలిపారు. వినుకొండ లయోలా స్కూల్‌లో వివిధ కేటగిరీలలో జరిగిన ఆటల పోటీలలో విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఆమె తెలిపారు.